GST NO: 36ACPPF9587L2ZM
TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక
CELEBRATING 12TH YEAR ANNIVERSARY
సంపుటి : 12 సంచిక : 127 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 25 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్







# భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం





- ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రుల సంతకాలు
- బ్రిటన్, భారత్ భాగస్వామ్యం కొత్త పుంతలు తొక్కిస్తుందన్న మోడీ

లండన్,జూలై24(సమయజ్యోతి

బ్రిటన్ మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు- ఇరు దేశాల మధ్య ఏటా 34 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని అంచనా. ఒప్పందం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాం. ఏఐ, సైబర్ సెక్యూరిటీ- వంటి అంశాల్లో కలిసి సాగుతాం. బ్రిటన్, భారత్ భాగస్వామ్యం కొత్త పుంతలు తొక్కనుంది. ఆరు బ్రిటన్ యూనివర్సిటీ-లు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు-చేస్తున్నాయి. పహల్గాం ఘటనను ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు అవకాశమే లేదు.ప్రజాస్వామ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేసేవారి పట్ల కఠినంగా ఉంటాం. పలు దేశాల మధ్య తలెత్తుతున్న ఉద్రిక్తతల పట్ల ఆందోళన చెందుతున్నాం.

2 లో



# భారత టెక్కీలను దూరం పెట్టండి

## అమెరికన్లకు ఉద్యోగాలపై ఫోకస్ పెట్టాలి

## గూటుల్, మైక్రోసాఫ్ట్‌లకు ట్రంప్ సూచన

వాషింగ్టన్,జూలై24(సమయజ్యోతి):

గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి మేటి టెకీ కంపెనీలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. విదేశీ ఉద్యోగులను తీసుకోవడం ఆపేయాలన్నారు. ముఖ్యంగా ఇండియా లాంటి దేశం నుంచి టెకీలను రిక్రూట్ చేసుకోవద్దు అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఏఐ సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా కంపెనీలు స్వదేశంలో ఉద్యోగాలు క్రియేట్ చేయడంపై ఫోకస్ పెట్టాలన్నారు. చైనాలో ఫ్యాక్టరీలు నిర్మించడం కానీ, భారతీయ టెకీ ఉద్యోగులను రిక్రూట్ చేయడం లాంటివి వద్దన్నారు. టెకీ కంపెనీలు ప్రదర్శిస్తున్న గ్లోబల్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. ఇలాంటి విధానం వల్ల అనేక మంది అమెరికన్లు ఇబ్బంది పడుతున్నట్లు- చెప్పారు. అమెరికా స్వేచ్ఛను వాడుకుని కొన్ని టాప్ కంపెనీలు అధిక లాభాలు గడించినట్లు- తెలిపారు. ఆ కంపెనీలు విదేశాల్లో ఎక్కువగా పెట్టు-బడి పెట్టాయన్నారు. ట్రంప్ అధ్యక్ష హయంలో ఇక రోజులు ఉండవని ఆయన అన్నారు. ప్రపంచదేశాల మధ్య శాంతి నెలకొల్పే విషయంలో భారత్-బ్రిటన్‌లు కలిసి ముందుకు సాగుతాయి. ఇది విస్తరణవాదానికి కాలం కాదు.. ఇది శాంతికి సమయం. అహ్మదాబాద్ విమాన దుర్ఘటన మృతుల్లో బ్రిటన్‌లోని ఎన్నారైలు ఉన్నారు.



# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

దేశ జీడీపీలో 5 శాతానికి పైగా తెలంగాణ వాటా

ఇదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్రభుత్వం

ఈ లక్ష్యసాధనలో పెట్టుబడులు పెట్టండి

ఇన్వెస్టోపియా గ్లోబల్' సమ్మిట్‌లో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి):

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దాలనేదే మా ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను శ్రీధర్ బాబు కోరారు. గురువారం హెచ్ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్' సమ్మిట్‌లోమాట్లాడారు.

02


## కులగణన సర్వే నిర్వహించడం

# అంత తేలిక కాదు

- తెలంగాణలో రేవంత్ అంచనాలకు మించి రాణించారు
- సర్వేపై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):

కులగణన సర్వే నిర్వహించడం అంత తేలిక కాదని తెలంగాణలో రేవంత్ రెడ్డి విజయవంతంగా కులగణన చేపట్టారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు అంచనాలకు మించి రాణించారని ప్రశంసించారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై ఢిల్లీలో ప్రజెంటేషన్ నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుటుంబ సర్వేపై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఒబిసి రిజర్వేషన్ల వ్యవహారం, రాష్ట్రం ఆమోదించి పంపించిన బిల్లుపై ఈ సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆఫీసు రూముల్లో కూర్చొని కులగణన చేస్తే మంచి ఫలితాలు రావు. తెలంగాణ కులగణనలో దాదాపు 56 ప్రశ్నలు అడిగారు. దేశంలో నిర్వహించే కులగణనకు ఇది మార్గదర్శిగా నిలుస్తుంది. సరైన డేటా చేతిలో ఉంటేనే ఏదైనా చేయగలం. ఇప్పుడు తెలంగాణ చేతిలో సరైన డేటా ఉంది. వీధిస్థాయి వరకూ డేటా ఇప్పుడు సిద్ధంగా ఉంది. ఇండియాలో తెలంగాణకు ఉన్న స్థాయిలో డేటా వ ం ే ం రాష్ట్రంలోనూ లేదు. ధనం, భూమి ఎవరి చేతుల్లో ఉన్నాయో తెలిపే డేటా తెలంగాణలో ఉంది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాల్సిన అవసరం ఉంది. అది పూర్తిగా బిజెపి భావజాలం. కులగణనను సరైన రీతిలో బిజెపి సర్కారు చేయదు. దేశ అసలైన వాస్తవ చిత్రాన్ని బహిర్గతం చేయడానికి బిజెపి ఇష్టపడదని రాహుల్ అన్నారు. సమాజాన్ని వేగంగా డెవలప్ చేసే శక్తి ఒక్క విద్యకే ఉందన్నారు రాహుల్ గాంధీ. దేశానికి ఇంగ్లీషు విద్య ఇప్పుడుచాలా అవసరం.. దళిత, ఆదివాసీ పిల్లలు ఇంగ్లీషులో చదవాల్సిన టైం వచ్చిందన్నారు. ఇంగ్లీషు తోపాటు ప్రాంతీయ భాషలు కూడా ముఖ్యమే అన్నారు రాహుల్ గాంధీ. బీజేపీ నేతలు ఇంగ్లీషు వద్దంటున్నారు.. వారి పిల్లలు ఏం మీడియంలో చదువుతున్నారో నిలదీయాలన్నారు రాహుల్ గాంధీ. వెనకబడిన వర్గాల పిల్లలు ఇంగ్లీషు చదవకూడదా అని ప్రశ్నించారు రాహుల్ గాంధీ. తెలంగాణలో కులగణన చాలా స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదో మైలురాయి అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అభినందించారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉంది.. కుల గణన నిర్వహణకు ఓ మార్గదర్శకం అన్నారు. కులగణన సక్సెస్ లో నిపుణుల కమిటీ- పాత్ర అద్భుతం అన్నారు. సరైన డేటా మన చేతిలో ఉంటే ఏదైనా చేయగలం.. ఇప్పుడు తెలంగాణ చేతిలో సంపూర్ణమైన డేటా ఉంది..తెలంగాణ అభివృద్ధికి ఇది ఎంతో తోడ్పడుతుందన్నారు రాహుల్. కులగణన నిర్వహించడం బీజేపీ సర్కర్ ఇష్టపడదు.. దేశ ముఖచిత్రాన్ని ప్రదర్శించేందుకు బీజేపీ ఇష్టపడదన్నారు.






## రాహుల్ హామీ మేరకు

# పకడ్బందీగీ సర్వే

- రాహుల్ డిమాండ్‌తో దిగొచ్చిన కేంద్రం
- జనగణనతో పాటు కుటగణనకు సర్కార్ నిర్ణయం
- బిసికోటా ఆమోదించేలా కేంద్రంపై పోరాటం
- మీరు పార్లమెంట్‌లో ..జంతర్‌మంతర్ వద్దమా పోరాటం
- తెలంగాణ కులగణనపై సిఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- మోడీ ఒరిజినలో బీసి కాదు...కన్వర్టెడ్ అంటూ రేవంత్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):

స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశంలో ఇప్పటివరకు కులగణన జరగలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ లక్ష్యం మేరకు తెలంగాణలో సమగ్ర కులగణనను చేపట్టామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తుచేశారు. రాహుల్ ఒత్తిడితోనేకేంద్రం దిగివచ్చిన జనగణనతో పాటు, కులగణనకు అంగీకరించిందని అన్నారు. రాహుల్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే చేసిందని చెప్పారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై దిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీలు, నేతలకు సీఎం రేవంత్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణలో కులగణన సర్వే ప్రక్రియను 2024లో మేం ప్రారంభించాం. తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వే సమగ్రంగా జరిగింది. ఇది 88 కోట్ల పేజీల్లో నిక్షిప్తమైంది. ప్రధాని మోదీకి బీసీలపై నిజమైన ప్రేమ లేదు. కొన్ని విషయాల్లో మోదీ సర్కార్ దిగివచ్చేలా రాహుల్‌గాంధీ పోరాటం చేశారు. ఆయన పోరాడినందువల్లే మూడు రైతు చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. కులగణన చేసేందుకు కూడా దిగి వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగాప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ బీసీ కాదని.. ఆయన కన్వర్టెడ్ ఓబీసీ అంటూ కామెంట్స్ చేశారు.

2లో

# బిసి ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటే దేశవ్యాప్త ఉద్యమం

రాహుల్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం

రాహుల్‌కు విషయాలన్నీ వివరించామం: మహేశ్ కుమార్ గౌడ్



న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):

బీసీ బిల్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి అనివార్యతను కాంగ్రెస్ పెద్దలకు సీఎం రేవంత్ బృందం వివరించింది. ఈ సందర్భంగా ముఖ్యంగా కులగణన తీరుతెన్నులపై రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారు. ఏయే కులాలు ఎంత శాతం ఉన్నాయో అడిగారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ఎంత ఉందో ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కులగణన విధానంపై పూర్తిగా సమాచారం తీసుకున్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

మిగతా 2 లో

## తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం

# 2.0 ఉద్యమం

- దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్థిక, సామాజిక సర్వే
- రాష్ట్రపతి అనుమతి కోసం ఎదురు చూస్తున్న బిసి బిల్లు
- రాహుల్ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం పోరాటం
- రాహుల్, ఖర్గేలతో సిఎం రేవంత, భట్టి తదితరుల భేటీ
- ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన మల్లి కార్జున ఖర్గే



న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):

తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు.

మిగతా 2 లో

మొదటి పేజీ తరువాయి

# భారత టెక్కీలను దూరం పెట్టండి

అమెరికాలో ఉదారమైన ప్రయోజనాలను పొందుతూ చైనాలో కర్మాగారాలను నిర్మిస్తున్నాయని అమెరికా దిగ్గజ కంపెనీలపై ట్రంప్ మండిపడ్డారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా కొన్ని కంపెనీలు అక్కడ భారత్ నుంచి ఉద్యోగులను నియమించుకుంటున్నాయని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనాలో తమ పరిశ్రమలను నిర్మించడం, అక్కడ భారత్ కు చెందిన కార్మికులను నియమించుకోవడం ద్వారా సదరు అమెరికా కంపెనీలు అమెరికన్ల విశ్వాసాన్ని కోల్పోయాయని అన్నారు. తన హయాంలో ఇక ఆ రోజులు ముగిసిపోయినట్టేనని చెప్పిన ట్రంప్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో గెలవడానికి దేశభక్తి కావాలన్నారు. ఏఐ రంగంలో అమెరికాను మొదటి స్థానంలో ఉంచాలని టెక్ కంపెనీలను ట్రంప్ కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో విజయం సాధించడానికి సిలికాన్ వ్యాలీ లోపల, వెలుపల కొత్త దేశభక్తి, జాతీయ విధేయత అవసరమని ట్రంప్ సూచించారు. అమెరికా టెక్ పరిశ్రమ చాలా కాలం వరకు రాడికల్ గ్లోబలిజాన్ని అనుసరించిందని.. ఇది మిలియన్ల మంది అమెరికన్లకు అపనమ్మకాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా వైట్ హౌస్ యాక్షన్ ఎ÷-లాన్ సహా కృత్రిమ మేధకు సంబంధించిన మూడు కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ అమెరికా కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్లూప్రింట్ ను విడుదల చేశారు. కీలక సాంకేతిక పరిజ్ఞానంలో చైనాపై అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నంలో పర్యావరణ నిబంధనలను సడలించడం, మిత్రదేశాలకు కృత్రిమ మేధ ఎగుమతులను విస్తరించడం లక్ష్యంగా ఈ కొత్త కృత్రిమ మేధ బ్లూప్రింట్ ను ట్రంప్ విడుదల చేశారు. 21వ శతాబ్దాన్ని.. ఏఐ నిర్వచించే పోరాటంగా అభివర్ణించిన ట్రంప్.. చైనాతో సాంకేతిక ఆయుధ పోటీని వివరిస్తూ ఈ ప్రణాళికను విడుదల చేశారు.

మొదటి పేజీ తరువాయి

## భారత టెక్కీలను దూరం పెట్టండి

మృతులకు మరోసారి సంతాపం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఎన్నారైలు భారత సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతున్నారు. క్రికెట్ అంటే ఓ ఆట కాదు... ఆదో పాషన్. క్రికెట్ తరహాలో భారత్-బ్రిటన్ దీర్ఘకాల భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాం. బ్రిటన్ ప్రధాని ఆతిథ్యానికి ధన్యవాదాలు. స్టార్మర్ భారత్‌కు రావాలని ఆహ్వానిస్తున్నా అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ఇదిలావుంటే బ్రిటన్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఎఫ్‌టీ-ఏపై సంతకాల అనంతరం ఇరుదేశాల నేతల ఉమ్మడి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర పరిణామం చోటు-చేసుకుంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆంగ్లంలో ప్రసంగిస్తుండగా.. దాన్ని అనువదిస్తున్న హిందీ ట్రాన్స్‌లేటర్ కాస్త ఇబ్బంది పడ్డారు. దీన్ని గుర్తించిన ప్రధాని మోదీ.. ఇబ్బంది పడకండి. అక్కడక్కడ ఇంగ్లీష్ పదాలను ఉపయోగించొచ్చు. దాని గురించి చింతించకండి అని పేర్కొన్నారు. జరిగిన దానికి అనువాదకురాలు క్షమాపణలు చెప్పగా.. పర్లేదరటూ పరిస్థితిని చక్కదిద్దారు. ఇదంతా గమనించిన బ్రిటన్ ప్రధాని స్టార్మర్ చిరునవ్వులు చిందించారు. 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' పేరుతో చేసుకున్న ఒప్పందంపై ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రులు సంతకాలు చేశారు. దీని ద్వారా భారత్- బ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు- ఇరుదేశాల మధ్య ఏటా 34 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని అంచనా

# కెటిఆర్‌కు సిఎం జన్మదిన శుభాకాంక్షలు

**ఎక్స్ వేదికగా రేవంత్, కవితల విషెస్-తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేసిన కెటిఆర్**

హైదరాబాద్,జూలై24(సమయజ్యోతిసమయజ్యోతి):

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈమేరకు తెలంగాణ సీఎంవో అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్టు పెట్టారు. అలాగే కేటీఆర్‌కు ఆయన చెల్లెలు, ఎమ్మెల్సీ కవిత జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'అన్నయ్య.. కేటీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇదిలావుంటే కేటీఆర్ జన్మదిన వేడుకలు తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య కేటీఆర్ కేక్ కట్ చేశారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి ఆయనకు బర్త్‌డే విషెస్ తెలిపారు. వారందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తనను అభిమానించే వారి ప్రేమ, ఆశీర్వాదాలతో మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటానని చెప్పారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు. పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్ తన తల్లిదండ్రులు కేసీఆర్, శోభ ఆశీర్వాదం తీసుకున్నారు. తన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షుతో కలిసి వెళ్లి కేసీఆర్‌ను కలిశారు.



మొదటి పేజీ తరువాయి

## రాహుల్ హామీ మేరకు

# పకడ్బందీగీ సర్వే

కన్వర్టెడ్ అయిన మోడీ బీసీల కోసం ఏం చేయరని విమర్శించారు. బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ కుల గణనకు వ్యతిరేకమని ఆరోపించారు. భారత్ జోడో యాత్రలో కుల గణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన మాట ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుల గణన సర్వే విజయవంతంగా నిర్వహించామన్నారు. రాహుల్ గాంధీ మాటే తమకు లక్ష్మణ రేఖ అని స్పష్టం చేశారు. దేశానికి ఒక దిశను చూపించేలా కులగణన సర్వే చేశామని.. తద్వారా కుల గణనపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. మొదటి నుంచి క్యాస్ట్ సెన్సస్‌కు వ్యతిరేకంగా ఉన్న బీజేపీని తెలంగాణలో విజయవంతంగా కుల గణన పూర్తి చేసి మన దారిలోకి తీసుకొచ్చామని చెప్పారు. చివరకు జనగణనలో కుల గణన చేసేలా ప్రధాని మోడీ అంగీకరించక తప్పని పరిస్థితి తెచ్చామన్నారు. మొత్తానికి మోడీని రాహుల్ గాంధీ రూట్లోకి తీసుకురాగలిగామని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త జనగణనలో కుల గణన చేయాలని నిర్ణయించడం రాహుల్ గాంధీ సక్సెస్ అని అన్నారు. తెలంగాణ మోడల్ ను వివిధ రాష్ట్రాల్లో ఎంపీలు చెప్పాలనదే మా ఆలోచన అని.. అందుకోసమే ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అన్నారు. కులగణన కేవలం సర్వేనే కాదని.. ఇది సొసైటి మెగా హెల్త్ చెకప్ అని అభివర్ణించారు. కుల గణన సర్వే ఆధారంగా తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామని.. ఇందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని మీరే ఒప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్లో మీరు కొట్లాడండి.. బయట జంతర్ మంతర్ దగ్గర మేం కొట్లాడుతామన్నారు. కులగణనపై సోనియా గాంధీ ఇచ్చిన లేఖ నాకు సర్వస్వమని అన్నారు. కుల గణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వివరాలు ఇవ్వలేదని.. వారి ముగ్గురిని తెలంగాణ జనభా నుంచి తీసేశామన్నారు. అంతకుముందు తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే ఇవాళ దేశానికి దిక్సూచిగా మారిందని అన్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు రాష్ట్రం అధికారంలోకి రాగానే కులగణన చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా విభజించి సమగ్రమైన సర్వే నిర్వహించినట్లు- వివరించారు. కాంగ్రెస్ ఒత్తిడితో దేశవ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్రం దిగి వచ్చిందని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమం

న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):



తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ- సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ఖర్గే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా... కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని... కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో మెజారిటీ-గా ఉన్నా.. కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యా సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించలేదు. ఢిల్లీలో ఏఐసీసీ నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయనతోపాటు- రాహుల్ గాంధీని తెలంగాణ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చలు చేపట్టారు. అంతేకాకుండా 50శాతం రిజర్వేషన్ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రజల ఒత్తిడికి లోనై కుల గణన నిర్వహించేందుకు అంగీకరించినా, 50 శాతం పరిమితిని తొలగించడానికి సిద్ధంగా లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా సంస్థలలో ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్లు సిఫారసు చేసిందని.. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నదని ఆయన గుర్తు చేశారు.

## బిసి ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటే

# దేశవ్యాప్త ఉద్యమం

**రాహుల్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం**

**రాహుల్‌కు విషయాలన్నీ వివరించామం: మహేశ్ కుమార్ గౌడ్**

న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):

బీసీ బిల్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి అనివార్యతను కాంగ్రెస్ పెద్దలకు సీఎం రేవంత్ బృందం వివరించింది. ఈ సందర్భంగా ముఖ్యంగా కులగణన తీరుతెన్నులపై రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారు. ఏయే కులాలు ఎంత శాతం ఉన్నాయో అడిగారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ఎంత ఉందో ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కులగణన విధానంపై పూర్తిగా సమాచారం తీసుకున్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన బీసీ బిల్లు ఆర్డినెన్స్ ను కేంద్రం ఒప్పుకోకపోతే దేశ వ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీసీ బిల్లుపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని అన్నారు. అసెంబ్లీలో ఓటేసిన బీజేపీ.. ఇప్పుడు మెలిక పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో రాంచందర్ రావు స్టేట్ మెంట్.. బీసీలకు వ్యతిరేకం అని చెప్పకనే చెబుతోందని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ కూడా బీసీలకు అన్యాం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో తగ్గించి మోసం చేశారని విమర్శించారు. ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన కీలక సమావేశం అనంతరం తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కుల సర్వే విధివిధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలపై చర్చించామన్నారు. అలాగే తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయ బద్దంగా చేసిన తీరుపై పార్టీ అగ్ర నేతలకు వివరించామని, రెండు గంటలపాటు- సమావేశం జరిగిందన్నారు. మేం ఇచ్చిన సమాచారాన్ని రాహుల్ గాంధీ, ఖర్గే విన్నారని, కేంద్రంలో పెండింగ్లో ఉన్న బిల్లులపై వారికి వివరించామన్నారు. గవర్నర్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన బిల్లులు ఇక్కడ పెండింగ్ లో ఉన్నాయన్నారు. దీని కోసం రాష్ట్రం పంపిన బిల్లుల ఆమోదానికి కేంద్రంతో పోరాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇంకా సుప్రీం కోర్టు రిజర్వేషన్ల క్యాప్ ను తొలగించేందుకు కేంద్రం పై ఒత్తిడి తెచ్చేలా పార్లమెంట్ లో పోరాడాలని కోరినట్లు- తెలిపారు. మొత్తానికి తెలంగాణ ప్రభుత్వం చేయాల్సింది చేసింది.. కేంద్రం వద్ద పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. మరోవైపు, బీజేపీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉందన్నారు. శాసనసభలో బీజేపీ ఓటు- వేసింది.. కానీ, కేంద్రం వద్దకు వచ్చే సరికి బీజేపీ యూటర్న్ తీసుకుందని తెలిపారు. దీనిపై 9వ షెడ్యూల్ లో చర్చ జరిపేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. అంతేకాకుండా తాము ఇండియా కూటమిలో ఉన్న అన్ని పార్టీల నేతలతో మాట్లాడుతామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఎంపీలకు కుల గణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ఇస్తారని ఆయన తెలిపారు. తెలంగాణ రోల్ మోడల్ గా మారిందని.. ఒకవేళ కేంద్రం ఆమోదం తెలపకుంటే.. రాహుల్ నేతృత్వంలో ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# స్వతంత్రత కోల్పోయిన ఎన్నికల సంఘం

**కర్ణాటకలో చీటింగ్ ఆధారం తమవద్ద ఉంది**

**మీడియాతో విపక్షనేత రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):




రాజ్యాంగబద్ద సంస్థ అయిన ఈసీ స్వతంత్రంగా తన పని తాను చేయడం లేదని కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటకలోని ఒక నియోజకవర్గంలో ఈసీ చీటింగ్ చేసిందని.. ఇందుకు సంబంధించిన 100 శాతం ఆధారం తమ పార్టీ వద్ద ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో మేం ఒక నియోజకవర్గాన్ని పరిశీలించగా.. వేల సంఖ్యలో అర్హత లేని కొత్త ఓటర్లను ఈసీ జాబితాలో చేర్చినట్లు- గుర్తించామని.. ఇందుకు సంబంధించిన ఆధారం తమ దగ్గర ఉందని ఆరోపించారు. కొన్ని నియోజకవర్గాల్లో కొత్త ఓటర్లు 45, 50, 60, 65, వేల మంది వరకు ఉంటున్నారని అనుమానం వ్యక్తం చేశారు. బీహార్ లో కూడా ఇప్పుడే ఇదే విధమైన మోసానికి ఈసీ పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘానికి ఒక్కటే చెప్పాలనుకుంటు న్నానని.. ఈ తప్పుల నుంచి మీరు తప్పించుకోలేరు. ఒకవేళ మేం తప్పించుకుంటా మనుకుంటే అది మీ పొరపాటే. తప్పు చేసిన ఏ ఒక్క అధికారిని వదలిపెట్టమని హెచ్చరించారు రాహుల్ గాంధీ. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ గురించి మీడియా ప్రశ్నించగా పై విధంగా రాహుల్ రియాక్ట్ అయ్యారు. రాహుల్ గాంధీ ఆరోపణలపై ఈసీ రియాక్ట్ అయ్యింది. నిరాధారమైన ఆరోపణలు చేయొద్దని సూచించింది. ఎన్నికల పిటిషన్లపై న్యాయస్థానాల్లో తీర్పు వచ్చే వరకు వేచి చూడాలని చెప్పింది.

# రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

**అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు**

**ఢిల్లీ నుంచే కలెక్టర్లతో సిఎం రేవంత్ సమీక్ష**

న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో మాట్లాడారు. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దిల్లీ నుంచే సీఎంవో అధికారులతో మాట్లాడారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి. నీటి ఉద్ధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు సాయం చేసేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు- ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెర్వులు, కుంటలు నిండి వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొ నేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటు-లో ఉండాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ఎప్పుడికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'భౌగోళికంగా చిన్నదైనా, ఆశయాలు, ఆచరణలో మాత్రం తెలంగాణ చాలా పెద్దది. స్వల్ప కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా ఎదిగి ఇతర రాష్ట్రాలకు అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచింది. 2024-25లో జీఎస్‌డీపీలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది జాతీయ సగటు-(7.6శాతం) కంటే ఎక్కువ. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా ఉంది అందుకే తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 టిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ సంకల్పమని శ్రీధర్‌బాబు అన్నారు.రాష్ట్రంలో డ్రై పోర్ట్‌లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్-జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో ఫేజ్ - 2 వంటి ప్రాజెక్టులు పారిశ్రామికా భివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్న ఫ్యూచర్ సిటీ-.. ఫిన్‌టెక్, క్లైమేట్‌టె-క్, స్మార్ట్ మొబిలిటీ- ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారబోతోంది. డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ- సెంటర్లు, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోంది. ఏడాదన్నర వ్యవధిలో కొత్తగా 3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు- పెరిగాయి. ఇందులో ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి కంపెనీలు ఇక్కడ పెట్టు-బడులు పెట్టాయి. మరింత మంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. యూఏఈ మాదిరిగానే తెలంగాణ కూడా సమయం, నమ్మకం, పరివర్తనకు విలువ ఇస్తుంది. ఇక్కడ ఏఐ, లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో ఎగుమతులు, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.



# సిరికొండలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## పీ.హెచ్.సీ, ప్రభుత్వ బడులు, తహసీల్దార్ కార్యాలయం, ఎరువుల గిడ్డంగి పరిశీలన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**



సిరికొండ మండల కేంద్రంలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలు, పీఏసీఎస్ ఎరువుల గిడ్డంగి, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. స్థానికంగా లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాన్ని సైతం సందర్శించిన కలెక్టర్, అర్హులైన వారికి కేటాయించేలా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. హాజరు పట్టిక ప్రకారం వైద్యాధికారి, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని పరిశీలించారు. పీ. హెచ్.సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాలలో విరివిరిగా ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, మెనూ ప్రకారం ఉన్నాయా అని తనిఖీ చేశారు. నీటి వసతి, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించి, బడులలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను గమనించారు. ఇంకనూ ఏమైనా మౌలిక వసతులు అవసరం ఉన్నట్లయితే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలని ఎంఈఓ రాములుకు, ప్రధానోపాధ్యాయులు సతీశ్, నరేష్ లకు సూచించారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు వచ్చాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ బడులలో మెరుగుపడిన సదుపాయాలు, నాణ్యమైన విద్యా బోధన గురించి వివరిస్తూ, విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా జరిగేలా చొరవ చూపాలన్నారు. తరుచూ బడికి గైర్హాజర్ అయ్యే విద్యార్థులను గుర్తిస్తూ, క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, పాఠశాలల నిర్వహణ మరింతగా మెరుగుపడేలా అంకితభావంతో కృషి చేయాలని హెచ్.ఎంలకు హితవు పలికారు. గ్రామాభివృద్ధి కమిటీ తోడ్పాటుతో విద్యార్థులకు ఐడీ కార్డులు, క్రీడా దుస్తులు సమకూర్చడం పట్ల కలెక్టర్ అభినందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి తహసీల్దార్ రవీందర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి అమలులో జిల్లాను ముందంజలో నిలిపేలా చిత్తశుద్ధితో పని చేయాలని హితవు పలికారు. కొత్త రేషన్ కార్డులు, పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, అర్హులకు ఆమోదం తెలుపాలని అన్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ కింద నిర్ణీత రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు సత్వరమే ప్రభుత్వం ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. కాగా, పీఏసీఎస్ ఎరువుల గోడౌన్ ను సందర్శించి, ఎరువుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా గట్టి పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. వివిధ నిర్మాణ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ సందర్శించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ పరంగా అవసరమైన తోడ్పాటును అందిస్తున్నామని గుర్తు చేశారు. అనంతరం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సందర్శించి, అర్హులైన లబ్ధిదారులకు వాటిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మనోహర్ రెడ్డికి సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జిల్లాలో

# 23 ఎరువులు, విత్తనాల దుకాణాలు కేటాయింపు:

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కేంద్రంలో ధరిత్రి మహిళా సమాఖ్య, అలాగే విలాసాగర్ గ్రామంలో విలాసాగర్ గ్రామైక్య సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన ఎరువులు మరియు విత్తనాల దుకాణాలను చొప్పదండి ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రైతన్నలకు ఉత్తమ సేవలు అందించేలా మహిళా సంఘాలకు ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే 3 దుకాణాలు ప్రారంభించామని వివరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాల బాధ్యులు ఐక్యంగా తమ దుకాణాలను సమర్థవంతంగా నిర్వహించి ఆర్థికంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# బురద రోడ్డుతో కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి

## రోడ్డు పక్కనే విద్యుత్ నియంత్రిక తో

## అపాయం పొంచి ఉంది

**సమయజ్యోతి న్యూస్ జూలై 24 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండలంలో కనుగుట్ట గ్రామంలో పాఠశాలకు వెళ్లి రహదారి చిన్న వర్షానికి బుదదమయం అడుగు తీసి అడుగు వేయలేని విధంగా ఉంది విద్యార్థులు నిత్యం పాఠశాలకు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాలి అనుభవిస్తున్నారు ప్రక్కన విద్యుత్ నియంత్రిక ప్రమాద భరితంగా ఉంది దానికి కంచలేని కారణంగా ప్రమాదం పొంచి ఉంది అని విద్యార్థులు వాపోతున్నారు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నియంత్రిక చుట్టూ కంచ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని విద్యార్థులు కోరుకుంటున్నారు అలాగే రహదారి మొరం వేసి బురద లేకుండా చూడగలరని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు



# ఇవ్ టీజింగ్ చేస్తే.. షీ టీంకు సమాచారం ఇవ్వాలి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మరియు కళాశాలలో గురువారము సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి, మమత, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎవరైనా విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు డయల్ చేయాలన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం కు ఫిర్యాదు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో కోడిగుడ్ల సరఫరా టెండర్ల పర్యవేక్షణకు కమిటీ

## : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఏడాదిపాటు కోడి గుడ్ల సరఫరా టెండర్ల పర్యవేక్షణకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కోడిగుడ్ల సరఫరా టెండర్ల పై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చైర్మెన్ గా, జిల్లా విద్యాధికారి, ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు బాధ్యులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సభ్యులుగా ఈ కమిటీ లో ఉంటారని వెల్లడించారు. ప్రభుత్వ వసతి గృహాల నుండి కోడిగుడ్ల ఇండెంట్ వివరాలు జిల్లా కలెక్టరేట్ కు సమర్పించాలని జిల్లా అడ్మినిస్ట్రేషన్ నుండి నేరుగా సప్లయర్ కు అవసరమైన కోడిగుడ్ల ఇండెంట్ ను సమర్పించడం జరుగుతుందని, గత సంవత్సరం అడ్మిషన్లకు అదనముగా 10% విద్యార్థుల సంఖ్యను పెంచి ఇండెంట్ తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కోడిగుడ్డు బరువు 45 గ్రాముల నుంచి 52 గ్రాములు ఉండాలని, ప్రతి మాసము రెండుసార్లు సప్లై చేయాలని, అర్హత, అనుభవం వారికి నిబంధనల ప్రకారం కోడిగుడ్లు సరఫరా చేసే హక్కులు అందజేస్తామని, కోడిగుడ్ల సరఫరాలో ఆలస్యం చేస్తే పెనాల్టీలు విధిస్తామని కలెక్టర్ తెలిపారు. టెండర్ల విధానం, టెండర్లు ఆహ్వానం, తెరవడం అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, ఆయా విద్యాలయాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ తాసిల్దార్ కు వినతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాల్కొండ తాసిల్దార్ కు గురువారము యూఎస్పిసి నాయకులు ఓ.రమేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలి. పీఆర్సీ వెంటనే అమలు చేయాలి. అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్ల షెడ్యూల్ ను వెంటనే ప్రకటించాలి. 5571 పిఎస్ హెచ్ఎం పోస్టులను, కొత్త జిల్లాలకు డిఇఓ పోస్టులను మంజూరు చేయాలి. పిఆర్సి ఇవ్వాలి. విశ్రాంత ఉద్యోగుల బిల్లులు చెల్లించాలి. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి. మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు పుట్ట రాజేశ్వర్, సాయికుమార్, సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# డబుల్ ఇంజన్ లేకుంటే పట్టించుకోరా?

రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం లేకుంటే...అక్కడ అభివృద్ధి పనులు సాగవా? అక్కడి ప్రజలను దేశప్రజలుగా బిజెపి చూడడం లేదా...రాష్ట్రం ఏదైనా బిజెపి అధికారంలో ఉండి డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే సహకారం అందిస్తారా? ఇప్పుడు తెలంగాణ విషయంలో అదే కనిపిస్తోంది. ఎపితో పోలిస్తే తెలంగాణ పట్ల నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండొచ్చు గాక..ప్రజలనుపీడించడం ఎందుకు. పథకాలను ఆపడం ఎందుకు.. నిధులను ఆపడం ఎందుకు...గత పదేళ్ల బిఆర్ఎస్ హయాంలోనూ... ఇప్పుడు కాంగ్రెస్ హయాంలోనూ ఇదే జరుగుతోంది.అవినీతి జరిగితే చర్యలు తీసుకోరు.కేవలం విమర్శలు చేసి ఊరుకుంటున్నారు. ఇలా చేయబట్టే కాళేశ్వరం విషయంలో లక్షకోట్లు తెలంగాణ ప్రజలు మునిగారు. ఇక ఎపిలో ఈ ఏడాదిలో నిధులు వరదలా పారుతున్నాయి. కేంద్రమంత్రులు ఎపికి క్యూ కట్టారు. వరాలు కోరుడు ఆలస్యం అన్నట్లుగా అన్నీ నెరవేరుస్తున్నారు. అక్కడి కేంద్రమంత్రులు నిలబడి సమస్యలను ప్రస్తావిస్తూ.. పరిష్కారాలు వెదుకుతున్నారు. దీనికి ఎవరికీ అభ్యంతరం లేదు. అక్కడా అభివృద్ధి జరగాల్సిందే. కానీ తెలంగాణను వెనకేయడం మాత్రం సరికాదు. కానీ తెలంగాణలో మాత్రం ఇద్దరు కేంద్ర మంత్రులు దుమమెత్తి పోయడానికే ఉన్నారు. నిరంతరాయంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే సరిపోతోంది. రాజకీయంగా తిట్టు ఎలా ఉన్నా...ఢిల్లీ స్థాయిలో నిలబడి తెలంగాణకు రావాల్సిన నిధులు, పనులను సాదించాల్సి ఉంది. కానీ బండి సంజయ్, కిషన్ రెడ్డిలు అలా చేయడం లేదు. నిస్సిగ్గుగా.. నిర్లజ్జగా తెలంగాణ పట్ల చూపిస్తున్న విక్ష గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. నిజంగానే మోడీ తెలంగాణ పట్ల కక్షసాధింపు చాటుకున్నారు. ఒక్క పైసా కూడా కేటాయింపులు లేకుండా కొన్ని రాష్ట్రాలను నిర్లక్ష్యం చేశారు. మొన్నటి బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం చేశారు. ఇందులో నూటికినూరు శాతం నిజం. కేవలం ఎన్డిఎ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే మేలు కలిగేలా తీసుకున్న నిర్ణయాలు సరికాదు. నిజానికి తెలంగాణ లేదా ఏ రాష్ట్రం అభివృద్ధి చెందినా అది దేశం అభివృద్ధికిందకే లెక్క. కానీ అలాంటి ప్రతిపాదనలు తెలంగాణ విషయంలో ఏమీ జరగలేదు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పలుమార్లు ఢిల్లీ చుట్టు తిరిగి వినతిపత్రాలు సమర్పించినా..సున్నా చూపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం చుట్టూ తిరుతామని, అభివృద్ధి వేరు, రాజకీయాఆలు వేరని సిఎం రేవతం పదేపదే చెబుతున్నారు. ఏనాడు కూడా రాష్ట్రానికి సంబంధించిన పనులు, నిధులపై సిఎం రేవంత్‌తో ఇద్దరు కేంద్రమంత్రులు చర్చించలేదు. ఎన్నో ఆశలతో ఇచ్చిన వినతిపత్రాల ను చిత్తు కాగితాల కింద మార్చినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణకే కాదు దేశం మొత్తం మీద బిజెపియేతర రాష్ట్రాల పరిస్థితి ఇలాగే ఉందేమో. అధికారంలో తాము లేకపోతే పట్టించు కోబోమని చెప్పకనే చెబుతున్నారు. అలాగే పేదలను గట్టెక్కించే ప్రయత్నాలు జరగలేదు. ధరలు ఎలా తగ్గించాలో చెప్పడంలేదు. ధరల పెరుగుదలకు కారణమై, సామాన్యుల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఎలాంటి చర్యలూ ప్రకటించలేదు. ఈ దశాబ్ది ఆఖరికి పదికోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని ఘనంగా పేర్కొన్నా అందుకు తగిన కార్యాచరణ, నిధుల కేటాయింపూ కనపడ లేదు. ఉద్యోగాలు సృష్టిస్తామన్న మాట, గతంలో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీలన్నీ డొల్లగా కనిపిస్తోంది. వ్యవసాయ రంగం మీద, ఉపాధి హామీ పథకం మీదా గతంలో మాదిరిగానే మోడీ ప్రభుత్వపు చిన్నచూపు కొనసాగింది. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు, చిన్న రైతులకు, పేదలకు తోడ్పాటునిస్తున్న ఉపాధి హామీకి నిధులను తెగ్గోసింది. పాలమూరు-రంగారెడ్డి విషయం పేర్కొనలేదు. ట్రిపుల్ ఆర్ గురించి మాట్లాడడంలేదు. తెలంగాణలోని ప్రాజెక్టులను జాతీయ హోదా ఇవ్వాలని 10 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా ఆ దిశగా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణం. గత 10 ఏళ్లుగా ప్రతి బడ్జెట్‌లో తెలంగాణ కు కేంద్రం మొండిచేయి చూపడంతో పాటు, అనేక పనులను పెండింగ్‌లో పెడుతున్నారు. కంటోన్మెంట్ నుంచి కరీంనగర్,నిజామాబాద్ రోడ్ల విస్తరణ 12 ఏళ్లయినా ముందుకు సాగడం లేదు. విభజన సమస్యలకు చాపచుట్టేశారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి బిజెపికి చెందిన ఎంపిలను ఎనిమిది మంది గెలిపించినా రాష్ట్రానికి నరేంద్ర మోడీ నిధులు కేటాయించక పోవడం దారుణం కాక మరోటి కాదు. తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం మాత్రం కనీసం పట్టించుకోవడంలేదు. తెలంగాణ లోని ఏ ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఏఐబిపి స్కీంలోకి తీసుకోకపోవడం విశేషం. తెలంగాణకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ఒక్క కొత్త ప్రాజెక్టును ప్రకటించలేకపోవడం విశేషం. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్కుకు ఆర్థిక సాయం, తెలంగాణలోని ఇండస్ట్రియల్ కారిడార్లకు నిధులు ఇవ్వడంలో కేంద్రం మొండిచేయి చూపింది. ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌లో హామీ ఇచ్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలను పక్కన పడేశారు. తెలంగాణకు జాతీయ విద్యా సంస్థల కేటాయింపులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదు. తెలంగాణ కోసం ఏమి చేయదల్చుకున్నారో చెప్పాలి. అవసరమైతే కేంద్రంతో కొట్లాడి తెలంగాణ ఆత్మగౌరవం చాటడంలో కేంద్రమంత్రులు ముందు నిలబడాలి. తెలంగాణ ఫస్ట్..తరవాతే రాజకీయం అన్నది పంథా కొనసాగాలి. ఇక్కడ కాంగ్రెస్ ఉన్నా, రేపు బిజెపి వచ్చినా అభివృద్ధి జరగాలి.

# శ్రీకరం శుభకరం శ్రావణం




సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

శ్రావణ మాసం లో నెల రోజుల పాటు ఆలయాల్లో గుడి గంటలు మోగనున్నాయి శ్రావణం అంటే పండుగలు పూజలు వ్రతాలు ఆధ్యాధ్మిక శోభ హెూమాలు శివ కేశవులకు అమ్మ వారికి ప్రీతికర మాసం నెల రోజుల పాటు నిత్య పూజలు ఆరాధనలు జరుగుతాయి ఆషాఢ మాసం అనంతరం వచ్చేది శ్రావణము ఈ నెల 25 అనగా నేడు శ్రావణ మాసం ప్రారంభం కానుంది శివాలయాలలో రుద్రాభిషేకాలు విష్ణు ఆలయాలలో పూజలు జరుగుతాయి సత్యనారాయణ స్వామి వ్రతాలు రాఖీ పండగ జంజీరాల పున్నం కూడా వస్తాయి పెళ్లిళ్లు పేరంటాలు ఎక్కువగా జరుగుతాయి గృహ ప్రవేశాలు కూడా ఈ మాసం లోనే జరుగుతాయి మహిళలు భక్తి శ్రద్ధలతో నెల పాటు నియమ నిష్టలతో వుంటారు భజనలు కుంకుమ పూజలు జరుగుతాయి సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరుగుతాయి అన్న దాన కార్యక్రమాలు కూడా నిర్వ హిస్తారు పంచాగం ప్రకారం ఏడాదిలో 12 నెలల్లో ప్రతి నెలకు ఒకొక్క ప్రత్యేకత ఉంటుంది. ఏడాదిలో మొదటి రోజే ఉగాది పండగతో మొదలు అవుతుంది. ప్రతి నెలలో రకరకాల పండుగలు, పర్వదినాలు, శుభ ముహూర్తాలు ఉంటాయి. తెలుగు నెలల్లో ఐదవ నెల శ్రావణ మాసం. వర్షాకాలంలో వచ్చే ఈ నెలలో ప్రతి రోజూ ఆధ్యాత్మికంగా విశేషమైన ప్రాముఖ్యతని కలిగి ఉంది. ఈ నెలలో వచ్చే పండగలు మాత్రమే కాదు.. శ్రావణ సోమవారాలు, మంగలవారాలు, శు క్రవారాలు, శనివారాలకు ప్రత్యేకత ఉంది. ఈ నేపధ్యంలో శ్రావణ మాసంలో వచ్చే కొన్ని ప్రముఖ పండుగల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం. సంవత్సరంలో ప్రత్యేక మైన మాసం శ్రావణమాసం. ఈ నెల ఆధ్యాత్మిక సందడితో నిండి.. భక్తి భరితమైన వాతావరణంతో అనిపిస్తుంది. ఆగష్టు 23వ తేదీతో శ్రావణ మాసం పూర్తయిపోతుంది. ఈ ఏడాది శ్రావణ మాసంలో ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు కొన్ని ముఖ్యమైన పండగలను జరుపు కోను న్నాము. శ్రావణ మాసంలోని ముఖ్యమైన పండగలు నాగ పంచమి ప్రతి ఏడాది శ్రావణ మాసం శుక్ల పక్షంలో వచ్చే పంచమిని నాగ పంచమిగా జరుపు కుంటారు. ఈ ఏడాది నాగ పంచమి జూలై 29 మంగళవారం జరుపు కోనున్నారు. పుట్టలో పాలు పోసి నాగులను పుజిస్తారు. వరలక్ష్మి వ్రతం: శ్రావణ మాసంలోని ప్రతి శు క్రవారం విశిష్టమైనదే. మహిళలు సుమంగళీగా జీవించే వరం ఇవ్వమంటూ.. తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలకు, సిరి సంపదల కోసం వరలక్ష్మి వ్రతం జరుపుకుంటారు. అయితే వరలక్ష్మి వ్రతం పున్నమికి ముందు వచ్చే శుక్రవారం మరింత ఫలవంతం అని భావిస్తారు. ఈ ఏడాది వరలక్ష్మీ వ్రతం శుక్రవారం ఆగస్టు 8వ తేదీన వచ్చింది. ఆగస్టు 1,15, 22 తేదీల్లో కూడా వరలక్ష్మీవ్రతం జరుపుకోవచ్చు. శ్రావణ మాసం విశిష్టత ను అందరుకి తెలుపుదాం భక్తి భావం తో ఉందాం

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

**జూలై 25 నుండి శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా**

**9848445134**

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో గురువారం బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బద్దం ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కత్తిరించి కార్యకర్తలకు పంపిణీ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ సూరజ్ రెడ్డి, నాయకులు మానేటి నాగభూషణం, చంద్రముని, నాయకులు దాసరి వెంకటేష్, సిరికంటి సాగర్ యాదవ్, ఎంఎ షాహిద్, ఫయాజ్ అలీ, రాంరాజ్ గౌడ్, కన్న పోశెట్టి, ప్రసాద్ గౌడ్, చిన్న బాల రాజేశ్వర్, కట్టెల శ్రీనివాస్ గౌడ్, షేక్ రహిమొద్దీన్, ఏనుగుందుల శ్రీనివాస్, జువ్వన్న, కాల గంగారాం, ప్రసాద్, శివ పాల్గొన్నారు.



# తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా బాలింతలకు కేసీఆర్ కిట్ పంపిణీ.

**సమయజ్యోతి న్యూస్ జూలై 24 బజార్ హత్నూర్**


సోనాల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా పరిసర ప్రాంతాల మహిళలకు కే సి ఆర్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తుల.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు కేటీఆర్ రాష్ట్రంలోని ఐటీ విభాగంలో ఎంతో సేవలందించి నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించిన మహానేత అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి బాలింత మహిళలకు కేసీఆర్ కిట్ల పంపిణీ అందించేవారు,కాంగ్రెస్ అధికారంలో రావడంతో కెసిఆర్ కిట్టును అందించకుండా పక్కన పెట్టడం చాలా సిగ్గుచేటట్టు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద మధ్యతరగతి మహిళలకు కేసీఆర్ కిట్టును పంపిణీ చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా కెసిఆర్ కిట్ల పంపిణీ నిరంతరం ఉంటుందని, మహిళలు ఎవరైనా డెలివరీ అయిన తర్వాత తుల శ్రీనివాస్ వెర్సల్ సొసైటీ కి సమాచారం అందిస్తే కెసిఆర్ కిట్టును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ వైస్ చైర్మన్ ఇర్ల అభిలాష్, యువ నాయకులు సుధీర్ రెడ్డి, చిన్నయ్య , హరీష్ , సోషల్ మీడియా కన్వీనర్ భీంరావు పాటిల్ , సోనాల మరియు బోథ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోమన్న, అల్లకొండ ప్రశాంత్ , మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మండల సర్పంచులు సురేందర్ యాదవ్, దేవేందర్, బాబు సింగ్, మాజీ ఎంపిటిసి లంక లలిత రాయల్, నాయకులు ఈశ్వర్, సంతోష్, యువకులు, మహిళలు పాల్గొన్నారు



# గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మెండోరా**

మెండోరా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం వైద్యాధికారి మద్దుల రాకేష్ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. వంట గది తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి ప్రియానా రాణి పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించిన ఎల్‌డీఎం

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 24.**

నిర్మల్ గ్రామీణ మండలంలోని సిద్ధులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమాన్ని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) రామ్ గోపాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రాథమిక సమాచారాన్ని అందించారు. ముఖ్యంగా సేవింగ్స్ ఖాతా, పాస్‌బుక్ ఫీచర్లు, కోడ్, కోడ్, బ్రాంచ్ కోడ్, వంటి అంశాలను వివరించారు. పాస్‌బుక్‌లో కనిపించే ఖాతాదారుడి పేరు, ఖాతా సంఖ్య, ఈమెయిల్ ఐడీ, బ్రాంచ్ కోడ్, నెంబర్, ఫిర్యాదుల కోసం సంప్రదించవలసిన నెంబర్లు, ప్రధాన కార్యాలయ చిరునామా మొదలైన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పాస్‌బుక్‌పై కనిపించే బార్‌కోడ్ గురించి, కరెన్సీ నోట్లపై ఉన్న భద్రతా లక్షణాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రతపై వీడియోలు ప్రదర్శించి, నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లావాదేవీల్లో పాటించవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. డబ్బును ఎలా వినియోగించాలి? అవసరాలు, కోరికల మధ్య తేడా ఏమిటి? అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆర్థిక విషయాలపై ఆసక్తిని కలిగించడంతో పాటు భవిష్యత్తుకు ఉపయోగపడే జ్ఞానాన్ని అందించిందని ఎల్‌డీఎం తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# 28న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు.

## - అథ్లెటిక్స్ ఎంపిక సంఘం అధ్యక్షుడు అడ్డి బోజారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, పి రాజేష్ లు తెలిపారు.అండర్-14, 16, 18, 20, మెన్, ఉమెన్ విభాగాలలో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అర్హత ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9:30 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 100 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు.పూర్తి వివరాలకు 9492136510 సెల్ నెంబర్ కు సంప్రదించాలని పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆగస్టు 3,4 తేదీల్లో హనుమకొండలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్,సీనియర్ మెన్ అండ్ విమెన్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగు తుందన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వయసు కట్ ఆఫ్ తేదీ లను వెల్లడించారు.ఏజ్ గ్రూప్స్ మరియు ఏజ్ బ్రాకెట్స్ ఫర్ జూనియర్స్. బాయ్స్ మరియు గర్ల్స్ (అండర్ -14) : పుట్టుక సంవత్సరం : 12-09-2011 నుండి 11-09-2013 మధ్యన ఉండాలి.బాయ్స్ మరియు గర్ల్స్ (అండర్ - 16) : పుట్టుక సంవత్సరం : 12-09-2009 నుండి 11-09-2011 మధ్యన ఉండాలి. బాయ్స్ మరియు గర్ల్స్ (అండర్ - 18) : పుట్టుక సంవత్సరము : 12-09-2007 నుండి 11-09-2009 మధ్యన ఉండాలి.

బాయ్స్ మరియు గర్ల్స్ (అండర్ -20) : పుట్టిన సంవత్సరం : 12-09-2005 నుండి 11-09-2007 మధ్యన ఉండాలి. సీనియర్స్ (మెన్ మరియు ఉమెన్స్): 20 సం. నుండి 30సం.లు 25-08-2025 ప్రకారంగా ఉండాలి.క్రీడా పోటీలు నిర్వహించు తేదీలను తెలియజేస్తూ, 28న జావెలిన్ త్రో ఎంపిక పోటీలు,జావెలిన్ డే ను పురస్కరించుకొని ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జావెలిన్ త్రో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజరెడ్డి,పి.రాజేష్ లు తెలిపారు. అండర్-8,10,12,14,16,18,20 సం.ల వయసు విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించ బడుతాయన్నారు.అర్హత గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియం లో రిపోర్ట్ చేయాలన్నారు.జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆగస్టు 7న జనగామ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయబడుతారని తెలిపారు.ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారుల వయస్సు కట్ ఆఫ్ తేదీలను క్రింది విదంగా ఉన్నాయి. క్రీడా విభాగాల్లో పాల్గొనే వయస్సులు : అండర్-8 బాయ్స్ మరియు గర్ల్స్ 08-08-2017 నుండి 07-08-2019 సం. నికి 60 మీటర్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్ అండర్ 10 బాయ్స్ మరియు గర్ల్స్ 08-08-2015 నుండి 07-08-2017 సం. 60మీటర్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్ అండర్ -12 బాయ్స్ మరియు గర్ల్స్



08-08-2013 నుండి 07-08-2015సం. 60మీటర్స్, లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్ త్రో అండర్ -14 బాయ్స్ మరియు గర్ల్స్ 08-08-2011 నుండి 07-08-2013 సం. కిడ్స్ జావెలిన్ త్రో, అండర్ - 16 బాయ్స్ అండ్ గర్ల్స్ 08-08-2009 నుండి 07-08-2011సం. జావెలిన్ త్రో, అండర్ -18 బాయ్స్ అండ్ గర్ల్స్ 08-08-2007 నుండి 07-08-2009సం. జావెలిన్ త్రో, అండర్ -20 బాయ్స్ అండ్ గర్ల్స్ 08-08-2005 నుండి 07-08-2007సం. జావెలిన్ త్రో, సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్స్ 07-08-2025 సం.నికి వయసు 20 సంవత్సరాల పైన ఉంటే జావెలిన్ త్రో లో పాల్గొంటారని తెలిపారు.

# ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మెండోరా**

మెండోరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వాతి వినూత్న ఆధ్వర్యంలో ఇంటింటికి సర్వే చేస్తూ ఆరోగ్య సేవలు అందించారు. 150 మంది రోగులకు బీపీ షుగర్ పరీక్షలు జరిపారు. అత్యవసర చికిత్స కోసం నేరుగా సంప్రదించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది సుకన్య, వాణి, సబిత, ఆశ రెడ్డి తోపాటు ఆశ వర్కర్లు, సూపర్వైజర్, పాల్గొన్నారు.



# అమరచింత లో ఘనంగా కె.టి. ఆర్ జన్మదిన వేడుకలు.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలోని బి. ఆర్. ఎస్. జెండా కట్ట దగ్గర ఐ.టి. మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. టి.ఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా భారీ కేక్ ను కట్ చేసి పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో బి. ఆర్. ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కల నర్సిములు గౌడ్, మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ రాజేందర్ సింగ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్.ఏ. రాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భూషణం గౌడ్ బి. ఆర్. ఎస్ కార్మిక సంఘ నాయకుడు న్యాయవాది ఎస్. అబ్రహం, రైతు సమన్వయ కమిటీ మాజీ జిల్లా సభ్యులు కె. జి. జయ సింహ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లెనిన్, మాజీ కో అప్షన్ సభ్యులు షన్వాజ్ ఖాన్,బి. ఆర్. ఎస్. నాయకులు జింక రవి, మాజీ సర్పంచ్ ఎల్. గోపాల్ నాయక్,డి. సి. పురుషోత్తం,హొటల్ నబి, బాలరాజు, అల్లీ,శరత్, సర్ధార్, ఎస్. ఎస్. జాన్, సలాం, తెలుగు రమేష్, యువ రాజ్, డ్రైవర్ శ్రీను,సోను, సోషల్ మీడియా ఇంచార్జి శివ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

## రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ చేసిన సేవలు ఎనలేనివన్న పార్టీ నేతలు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను మాజీ మంత్రి జోగు రామన్న ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.పార్టీ కార్యాలయంలో టపాసులు పేల్చి సంబరాలు జరిపారు.అనంతరం కేక్ కట్ చేసి కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.తర్వాత ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ నాయకులు,కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ చేసిన సేవలు ఎనలేనివని పార్టీ నేతలు కొనియాడారు.



# ఊరు మందమర్రి చెరువు అక్రమార్కులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నా అధికారులు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి చెరువు ఆక్రమణకు గురైందని, అక్రమ కట్టడాలు కడుతున్నారని కట్టడాలను తొలగించి చెరువు భూమిని కాపాడాలని ఫిర్యాదు చేసి దాదాపు సంవత్సరం అవుతున్న సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారా అని బహుజన్ సమాజ్ పార్టీ సంబంధిత అధికారులను ప్రశ్నించడం జరిగింది. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆ కాలంలో ఊరు మందమర్రి చెరువు నీటితో కళకళలాడేదని, ఎందరో రైతులు ఇదే నీటితో పంటలు పండించే వారని, చెరువులో చేపలు సైతం పెంపకం చేసేవారని అలాంటి ఊరు చెరువు ఆక్రమణకు గురైందని, అక్రమ కట్టడాలు కడుతున్నారని కట్టడాలను తొలగించి చెరువు, చెరువు భూమిని కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేసి ఏడాది కావస్తున్న అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అధికారులు పట్టించుకోక పోవడానికి కారణం ఏమిటని, నోటీసులు జారీ చేసినట్లయితే పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు ఎందుకు తీసుకోలేదని సంబంధిత అధికారులను బీఎస్పీ గా ప్రశ్నిస్తున్నానని అన్నారు. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడలేని ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమా లేక నాయకుల అండదండల అనే సందేహం వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మందమర్రి ఊర చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని లేదంటే బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు గాజుల శంకర్, ఎండి మతిన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి షేక్ రహీం బాబా, నాయకులు సత్తారపు నారాయణ, షేక్ అలమ్ లు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్**

మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఇంచార్జీ ఎస్సై అంజమ్మ తెలిపారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర కు చెందిన ఇద్దరు వృద్ధులు ద్విచక్రవాహనం పై ఆదిలాబాద్ వైపు వెళు ుండగా వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కంటైనర్ వాహనం మోటార్ సైకిల్ ను ఢీకొనడంతో మహారాష్ట్ర సావిరి గ్రామానికి చెందిన గుట్టే బానుదాస్(75)అనే వృద్ధుడు సంఘటన స్థలంలో మృతి చెందాడు అలాగే బోదిడి కి చెందిన గుట్టే బాపురావ్ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి అతన్ని 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు కంటేనర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇంచార్జీ ఎస్సై తెలిపారు



# బిఆర్ఎస్ లీగల్ సెల్.. కేటీఆర్ జన్మదిన వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలో గురువారము సీనియర్ న్యాయవాది రవీందర్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేటీఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ప్రజల పక్షాన నిలబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు నర్సింగరావు, కోడి లక్ష్మణ్, సుజీవన్, సదానందం, ప్రసాద్ గౌడ్, పూర్ణచందర్, సుధీర్, కోల నరేష్, గుగులోతు, రమేష్ పాల్గొన్నారు.



# ఈరోజు పట్టణ సిఇఆర్ క్లబ్ లో టీయుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యవర్గ సమావేశం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

మందమర్రి మండల టీయుడబ్ల్యూజె (ఐజెయు) యూనియన్ సభ్యులతో జిల్లా నాయకులు మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10:30 నిమిషాలకు సింగరేణి సిఇఆర్ క్లబ్ లో నిర్వహిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు దేగ సత్యం, ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు మద్దెల సంజీవ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అనంతరం మందమర్రి మండల టీయుడబ్ల్యూజె (ఐజెయు) యూనియన్ సభ్యులతో సమావేశ సందర్భంగా అనర్హుల వాహనాలపై ప్రెస్ లోగో స్టికర్ల తొలగింపు పై పోలీసు అధికారులకు విన్నవించడం, సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించుట, ఒక మండలంలో ఒక్కటే ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చ ఉంటుంది. అనంతరం స్థానిక సభ్యుల ద్వారా సమస్యల విన్నపాలు స్వీకరణ, యూనియన్ కట్టుబాట్లు, నియమ నిబంధనల గురించి సూచనలు చేస్తారని జిల్లా టియూడబ్ల్యూజే (ఐజేయు) అనుబంధం జిల్లా కమిటీ ఓ ప్రకటన విడుదల చేయడం జరిగింది.

# వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ వారి శ్రీ షిర్డీ సాయి సేవా సొసైటి వారి సౌజన్యంతో అదిలాబాద్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం లో గురువారం ఉచిత వృత్తి విద్య నైపుణ్య శిక్షణా కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. శిక్షణ కేంద్రంలో టైలరింగ్,ఎంబ్రాయిడరీ,కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణను అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం డ్వాక్రా గ్రూపోల్ సభ్యత్వం తీసుకొని,గ్రూపు ద్వారా లేదా బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చున్నారు.శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతిని సాధించాలని సూచించారు.



# సోషల్ మీడియా పోస్టులపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి సిరిసిల్ల**

సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు ఫార్వర్డ్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పేర్కొన్నారు. జిల్లాలో సోషల్ మీడియా ట్రాకింగ్ సెల్ ద్వారా ప్రతి పోస్టును నిరంతరం నిశితంగా పరిశీలించడం జరుగుతుందని, శాంతి భద్రతలకు, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా, మత విద్వేషాలకు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టే వారి పై క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని అన్నారు.



# తుర్కపల్లి గ్రామంలో పాము కాటుతో మహిళ మృతి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

తుర్కపల్లి గ్రామంలో పాముకాటుకు గురై ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.సంఘటన వివరాలు మృతురాలు మంద శ్రీలత (30) గృహిణి తుర్కపల్లి గ్రామవాసి ఉదయం 4 గంటల సమయంలో బయటకు వెళ్లగా ఆమె కుడి కాలు మడమపై పాము కాటు వేసింది. ఈ విషయాన్ని ఆమె వెంటనే తన భర్త అయిన మంద రాజుకు చెప్పడంతో వెంటనే 108 అంబులెన్స్ కు కాల్ చేసి ఆమెను మొదట మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లడం జరిగింది. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో శ్రీలత మృతి చెందడం జరిగింది. ఈ సంఘటనపై మృతురాలి భర్త మంద రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మందమర్రి ఏఎస్ఐ మాజీద్ కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



# రైతుల సౌకర్యార్థం ఎరువుల దుకాణం ఏర్పాటు చేయాలి



సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం లేదా సహకార సొసైటీ ద్వారా యూరియా, ఎరువులు, దుక్కి మందు సరఫరా చేయాలని గ్రామ రైతు చిగురు వెంకన్న కోరారు.

# ర్యాగింగ్ చేయడం నేరం : జడ్జి రాధిక జైస్వాల్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయడం నేరమని సీనియర్ సివిల్ జడ్జి - కం - జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణము సహార జూనియర్ కళాశాలలో నిర్వహించిన ర్యాగింగ్ నిషేధంపై అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ర్యాగింగ్ కారణంగా బాధిత విద్యార్థులు అనేక మనోవేదనలు అనుభవించి, కొంతమంది తాము చదువు కొనసాగించలేని పరిస్థితిలోకి వస్తున్నారని, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఎక్కడైనా ర్యాగింగ్ జరిగితే వెంటనే సంబంధిత అధికారులు, పోలీసులకు తెలియజేయాల్సిందిగా సూచించారు. సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, గెంట్యాల భూమేష్, ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




# మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్ తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

మండల ప్రత్యేక అధికారి, నిజామాబాద్ జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి, గురువారం బాల్కొండ మండల కేంద్రంలో మైనార్టీ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు, కిషన్ నగర్ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, వైద్యాధికారి స్రవంతి, ఎంపీఓ ఆర్.గంగమోహన్, ఏపీఎం ఇందిర, వేణు గోపాల్, పంచాయతీ కార్యదర్శులు రేణుక, టీవీ ధనుంజయ్, జే ఏ నిశాంత్ రెడ్డి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



# ఊరురా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారము బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు కేకు కత్తిరించి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరము బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశారు. దీనికి ముందుగా ముస్తాబాద్ శివకేశవుల ఆలయాల్లో అర్చకులు హరీష్ పంతులు ఆధ్వర్యంలో కేటీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పోతుగల్, మద్దికుంట, మోహిని కుంట, రామిరెడ్డి పల్లె, కొండాపూర్ తుర్కపల్లి తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పార్టీ శ్రేణులు కలకుంట్ల గోపాలరావు, ఏనుగు విజయ రామారావు, తన్నీరు గౌతమ్ రావు, సంతోష్ రావు, అక్కరాజు శ్రీనివాసు, సర్వర్ పాష, శీలం స్వామి, రమేష్ రెడ్డి, గూడూరి భరత్, కొమ్ము బాలయ్య, గాండ్ల సుమతి, కాసోల్ల పద్మ దుర్గాప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థలకు సిద్ధమవుతున్న బిజెపి

నేడు వట్టిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన స్థానిక జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల కార్యాశాల లో భాగంగా మండల అధ్యక్షులు అశోక్ కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి 9 ఎంపీటీసీలు ఒకటి జడ్పిటిసి స్థానంలో బిజెపి అభ్యర్థులను బరిలో దింపి విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆందోల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్ స్వామి, జిల్లా కౌన్సిల్ మెంబర్ సురేష్ గౌడ్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు పట్లోళ్ల అరవింద్ పటేల్, మండల జనరల్ సెక్రెటరీ యాదయ్య %c% నగేష్ చారి, నియోజకవర్గం బీజేవైఎం కో కన్వీనర్ అనిల్ కుమార్,మండల సోషల్ మీడియా కన్వీనర్ శశిధర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు సంగమేశ్వర్, మండల సీనియర్ నాయకులు వెంకట్రావు , పాలడుగు చందు, ఆంజనేయులు ఆగమయ్య లక్ష్మణ్ వినయ్ కుమార్ నర్సింలు, శ్రీశైలం, గోపాల్ ,జయపాల్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రతి పాఠశాలలో లైబ్రరీ తప్పనిసరి

గండీడ్( సమయజ్యోతి రిపోర్టర్ )జూలై 24

ఈరోజు మహబూబ్నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు తప్పకుండా ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం శుభపరిణామం అని మండల విద్యాధికారి రుద్రారం జనార్దన్ మాట్లాడారు. కార్యక్రమంలో సల్కర్ పేట్ ప్రధానోపాధ్యాయులు విజయ లక్ష్మి, ఆర్.పి.లు కృష్ణారెడ్డి, సికిందర్, కేశవులు, బాల్ రాజ్ గౌడ్, పి.ఆర్.టి.యు టి.ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, టి.ఎస్.యు.టి.ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పద్యానాయక్ బోరు కృష్ణయ్య, టి.ఎస్.సి. పి.ఎస్. మండల ప్రధాన కార్యదర్శి దోమ లక్ష్మయ్య, ప్రైమరీ హెడ్మాస్టర్స్ కిషన్, సేవియా, అరుణదేవి, మంజుల, తదితర టీచర్స్ పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఎద్దు.. బైక్ చోదకుడు దుర్మరణం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ



బాల్కొండ మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానికుడు గుమ్ముల రాజు(48) అనే వ్యక్తి మృతి చెందినట్లుగా స్థానికులు తెలిపారు. ఎంఆఇ కార్యాలయం ముందు రెండు ఎద్దు పొట్లడుకుంటూ హఠాత్తుగా రోడ్డు పైకి వచ్చి అటుగా వస్తున్న రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాయి. దీంతో రాజు, వాహనంతో పాటు రోడ్డు పై పడగా అతని తలకు తీవ్ర గాయాలైనాయి. 108 వాహనం లో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, ఒక్క కొడుకు ఉన్నారు.

# పేర్ని నానికి హైకోర్టులో ఊరట

## 31 వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు వద్దని ఆదేశం

అమరావతి,జూలై24(సమయజ్యోతి):

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నానికి మరోసారి కోర్టులో ఊరట లభించింది.. ఈ నెల 31వ తేదీ వరకు పేర్ని నానిపై ఎటువంటి తొందరపాటు- చర్యలు తీసుకోవద్దని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు పొడిగించింది.. మాజీ మంత్రి పేర్ని నాని ఇటీవల రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసులు నమోదు అయ్యాయి.. దీంతో, ముందస్తు రక్షణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు నాని.. మరోవైపు, ఈ రోజు కేసు రీచ్ కాక పోవడంతో మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని కోరారు పేర్ని నాని తరపు న్యాయవాదులు.. దీంతో, కేసు తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు.. అప్పటి వరకు ఉత్తర్వులను పొడిగిస్తున్నట్టు- పేర్కొంది.. దీంతో, హైకోర్టులో మాజీ మంత్రి పేర్ని నానికి మరోసారి ఏపీ హైకోర్టులో ఊరట దక్కినట్టు- అయ్యింది..

# జువైనల్ హోం నుంచి ఐదుగురు బాలుర పరార్

హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి):

నగరంలోని సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని జువైనల్ హోం నుంచి ఐదుగురు బాలురు పరారయ్యారు. ఈనెల 21న రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. 16-17 ఏళ్ల వయసున్న వీరిలో ఇద్దరు ఏపీకి చెందినవారు కాగా.. ముగ్గురు తెలంగాణ వాసులు. రాత్రి భోజన సమయంలో సిబ్బంది కళ్లుగప్పి ఈ ఐదుగురు బాలురు గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకి వెళ్లారు. వీరి కదలికలు సిబ్బందికి కనబడకుండా మరో ఇద్దరు అడ్డుగా నిల్చున్నారు. దీంతో పథకం ప్రకారం.. మొదటి అంతస్తులోని గేటు తాళం విరగొట్టి పైనుంచి దూకి పారిపోయారు. బాలుర పరారీపై సంబంధిత అధికారి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వర్షాల వేళ గర్భిణికి అవస్థలు

## పురిటి నొప్పులు రావడంతో భుజాలపై వాగు దాటించిన పెద్దలు


ములుగు,జూలై24(సమయజ్యోతి):

సరైన రోడ్డు సౌకర్యం లేక గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న వైనం మరోటి వెలుగులోకి వచ్చింది. ఇక వర్షాకాలం వచ్చిందంటే చాలు వాళ్ల కష్టాలు వర్ణనాతీతం. గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులుఅమెను ఎత్తుకుని వాగు దాటించారు.ములుగు జిల్లా తాడ్వాయి మండలం బంధాల గ్రామపంచాయతీ పరిధి అల్లిగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి కృష్ణవేణి అనే మహిళ నిండు గర్భిణి. ఆమెకు గురువారం తెల్లవారుజామున పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఉద్యుతంగా ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగులో ఆ మహిళను భుజాలపై మోసుకుంటూ వెళ్లి వాగు దాటించారు.ఈ సీజన్‌లో ఆస్పత్రికి వెళ్లాలంటే సుమారు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. అక్కడికి చేరుకోవాలంటే మాత్రం అల్లిగూడెం- నర్సాపూర్ మార్గమధ్యలో ఉన్న కిన్నెరసాని వాగు దాటాల్సిందే. ప్రభుత్వం ఇప్పటి-కై-నా స్పందించి ఈ వాగుపై వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్టణం,జూలై24(సమయజ్యోతి):

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విపా తుఫాన్ అవశేషం కావడంతో బలపడుతుందని ఐఎండీ అంచనా వేసింది. 7.5కి.మీ వరకు అల్పపీడనం వ్యాపించింది. ఛత్తీస్‌ఘడ్ మీదుగా ద్రోణి, మరో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. వచ్చే రెండు రోజులు ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. తీరం వెంబడి గరిష్టంగా 60కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి. పోర్టుల్లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. భారీ వర్షాలు కురిస్తాయి కాబట్టి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని హెచ్చరించారు. నీరు, కరెంటు- రెండూ కలిస్తే ప్రమాదం ఉంది. టీవీ, ఫ్రిజ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ప్లగ్‌ని తీసేయండి. లేదంటే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. కొన్నిసార్లు వరదలపై అవగాహన ఉండదు. అయితే ఇంట్లోకి వర్షపు నీరు వచ్చే అవకాశం ఉన్నట్లయితే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం చాలా మంచిది. ఆహారం, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీటిని నిల్వ చేసుకోవాలి.



# రష్యాలో ఘోర విమాన ప్రమాదం

## గమ్యస్థానానికి దగ్గరలో కుప్పకూలిన అంగార విమానం

## 49మందితో వెళుతున్నట్లు గుర్తించిన అధికారులు

**మాస్కో,జూలై24(సమయజ్యోతి):**

రష్యాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. 49 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలో కుప్పకూలింది. తొలుత ఈ విమానం అదృశ్యమైనట్లు- వార్తలు రాగా.. కాసేపటికే అది కూలిపోయినట్లు- అధికారులు నిర్ధరించారు. ఎటిసి నుంచి సంబంధాలు తెగిపోగా ఎక్కడ అదృశ్యం అయ్యిందా అన్న ఆందోళన నెలకొంది. అంతలోనే కూలిపోయినట్లు సమాచారం అందింది.అంగారా ఎయిర్‌లైన్‌కు చెందిన ఏఎన్‌-24 విమానం గురువారం ఉదయం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ కావాల్సి ఉండగా.. ఉన్నట్టుండి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎమర్జెన్సీ సర్వీసెస్‌ను సిద్ధం చేశారు. విమానం కోసం గాలించగా.. గమ్యస్థానానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో అది కూలిపోయినట్లు గుర్తించారు. దీంతో అందులో ఉన్నవారంతా మరణించి ఉంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలంలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. పరిస్థితులు అనుకూలించలేదని తెలిసింది. రెండోసారి ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. రాడార్ నుంచి సంబంధాలు తెగిపోయి గల్లంతై కూలినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 43 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికుల్లో ఐదుగురు చిన్నారులు ఉన్నట్లు రష్యన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాణనష్టంపై ఇంకా వివరాలు తెలియరాలేదు. అయితే ఎవరు కూడా బతికి ఉండరని తెలుస్తోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

### ఆ ఒక్క పథకంతో

# విప్లవాత్మకమార్పు

## మహాలక్ష్మిపై సిఎం రేవంత్ ఎక్స్‌లో పోస్ట్

**హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి):**

ఒక సంక్షేమ పథకం అనేక విప్లవాత్మక మార్పులకు కారణమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆడబిడ్డలకు ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచిందని పేర్కొన్నారు. ఒక్క పథకం వల్ల ఆర్టీసీ సంస్థ అప్పుల నుంచి గట్టెక్కిందని తెలిపారు. 200 కోట్ల జీరో టికెట్లతో సరికొత్త రికార్డుకు చేరుకుందని వివరించారు. ఆర్టీసీకి ప్రాణం పోసిన ప్రతి ఉద్యోగి, సిబ్బంది, కార్మికులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ యాజమాన్యానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఒక్క పథకం వల్ల ఆర్టీసీలో ఆడబిడ్డల ఆక్యుపెన్సీ 35 నుంచి 60 శాతానికి పెరిగింది. ప్రజాపాలన ప్రారంభమయ్యే నాటికి ..ఇక ఆర్టీసీ కథ కంచికే అన్నట్లు-గా పరిస్థితి ఉండేది. పేదవాడి ప్రగతి రథ చక్రం ఇక చరిత్ర పుటల్లోకి జారి పోతుందనే విధంగా ఉండేది. అక్కడ నుంచి మొదలైన ప్రయాణం నేడు 200 కోట్ల జీరో టికెట్లతో ఆడబిడ్డలకు సాయం చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

**న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నాలుగో రోజుకి చేరుకున్నారు. బీహార్‌లోని ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ పై చర్చను నిర్వహించాలని ప్రతిపక్షాలు గత నాలుగు రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ప్లకార్డులు ప్రదర్శించంతో పాటు- వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేపట్టారు. దీంతో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. రాజ్యసభ సైతం మధ్యాహ్నానికి వాయిదా పడింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా ఎలాంటి కార్యక్రమాలు సాగలేదు.



# ముంబయి బాంబు పేలుళ్ల కేసు

## మహారాష్ట్ర హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ,జూలై24(సమయజ్యోతి):**

2006 ముంబయి బాంబు పేలుళ్ల కేసులో 12మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. హైకోర్టు తీర్పును ఒక ఉదాహరణగా పరిగణించరాదని జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులోని నిందితులందరికీ నోటీసులసు జారీ చేసింది. అయితే నిందితులను జైలు నుండి విడుదల చేయడాన్ని నిలిపివేయలేదు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ పిటిషన్ దాఖలు చేసింది. 2006 జులై 11న ముంబయిలోని ప్రత్యేక లోకల్ ట్రైన్‌లో 11నిమిషాల వ్యవధిలో ఏడు బాంబు పేలుళ్లు జరిగాయి.ఈ ఘటనలో 180మందికి పైగా మరణించారు. ముంబై శివారు వెస్టర్న్ లోకల్ రైళ్లలో జులై 11, 2006న జరిగిన ఏడు పేలుళ్లు భారతదేశ చరిత్రలో అత్యంత ఘోరమైన ఉగ్రవాద దాడుల్లో ఒకటిగా నిలిచాయి. సాయంత్రం రద్దీ సమయంలో జరిగిన ఈ దాడుల్లో 189 మంది ప్రాణాలు కోల్పోగా, 820 మందికి పైగా గాయపడ్డారు. ఈ కేసులో 12 మంది నిందితులను మహారాష్ట్ర యాంటీ ట్రరిజం స్క్వాడ్ అరెస్టు చేసి, స్పెషల్ కోర్టు వారిని దోషులుగా తేల్చింది. ఐదుగురికి మరణశిక్ష, మిగిలిన ఏడుగురికి జీవిత ఖైదు విధించారు. అయితే, బాంబే హైకోర్టు ఇటీవల ఈ తీర్పును రద్దు చేస్తూ, నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును స్వీకరించి, బాంబే హైకోర్టు తీర్పును స్టే చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ఎన్.కె. సింగ్ బెంచ్ ముందు వాదిస్తూ, నిందితులను తిరిగి అరెస్టు చేయాలని కోరడం లేదని, కానీ బాంబే హైకోర్టు తీర్పులోని కొన్ని పరిశీలనలు మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ కింద పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులపై ప్రభావం చూపవచ్చని వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు, నిందితులను జైలుకు తిరిగి పంపాల్సిన అవసరం లేదని, అయితే హైకోర్టు తీర్పును ఇతర కేసులకు ప్రామాణికంగా పరిగణించరాదని ఆదేశించింది. దీని ప్రకారం, హైకోర్టు తీర్పు ప్రామాణిక విలువను మాత్రమే స్టే చేశారు. జూలై 21న, బాంబే హైకోర్టు జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ శ్యామ్ చందక్ బెంచ్, 12 మంది నిందితుల శిక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ వారిని దోషులుగా నిరూపించడంలో విఫలమైందని కోర్టు తెలిపింది. అంతేకాక, మహారాష్ట్ర ఆ÷ూ దర్యాప్తు పద్ధతులపై తీవ్ర విమర్శలు చేసింది. నిందితులు కస్టడీలో హింసకు గురయ్యారని, దర్యాప్తు అధికారులు ఫలితాల కోసం ఒత్తిడికి గురిచేశారని హైకోర్టు ప్రస్తావించింది. సుప్రీంకోర్టు ఇప్పుడు ఈ కేసును విచారణకు స్వీకరించడంతో, బాంబే హైకోర్టు సమర్పించిన ఆధారాలు, న్యాయపరమైన తీర్మానాలపై తుది నిర్ణయం ఆధారపడి ఉంటు-ంది. ఈ కేసు భారత న్యాయ వ్యవస్థలో ఉగ్రవాద ఆరోపణలు, దర్యాప్తు పద్ధతులపై మరింత చర్చకు దారితీసే అవకాశం ఉంది.

# అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు

## ఆర్థిక అవతవకలపై ఫిర్యాదులతో చర్యలు

**ముంబయి,జూలై24(సమయజ్యోతి):**


మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఢిల్లీ మరియు ముంబయిలోని రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి చెందిన సంస్థలపై ఇడి గురువారం దాడులు చేపట్టిందని అధికారులు తెలిపారు. భారీ ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సిబిఐ రెండు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నాయి. ఆపరేషన్‌లో భాగంగా ఈ కేసుతో సంబంధం ఉన్న 50కి పైగా సంస్థలపై ఇడి అధికారులు దాడులు చేసి రికార్డులను పరిశీలిస్తోంది. 25మందికి పైగా వ్యక్తులను ప్రశ్నిస్తోంది. సుమారు 35 ప్రదేశాల్లో దర్యాప్తు సంస్థ సోదాలు నిర్వహిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ప్రణాళికాబద్ధంగా, ముందస్తు ఆలోచనతో రూపొందించిన పథకంతో బ్యాంకులు, వాటాదారులు, పెట్టుబడి దారులు మరియు ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజా ధనాన్ని స్వాహా చేసినట్లు ఇడి ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన సంగతి తెలిసిందే. రుణాలను సులభతరం చేయడానికి యెస్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ ప్రమోటర్లు సహా సీనియర్ బ్యాంక్ అధికారులకు లంచం ఇచ్చినట్లు- తెలిపింది. 2017-2019 మధ్య, యెస్ బ్యాంక్ రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ కింద ఉన్న ఆర్ఎఎజిఎ కంపెనీలకు సుమారు రూ.3,000 కోట్ల రుణాలను మంజూరు చేశారని పేర్కొంది. యెస్ బ్యాంక్ ప్రమోటర్లు రుణాలు మంజూరు చేయడానికి ముందు వారి ప్రైవేట్ ఆధీనంలో ఉన్న కంపెనీల్లో చెల్లింపులను తీసుకునేందుకు వీలుగా చట్టవిరుద్ధమైన క్విడ్ ప్రోకో జరిగినట్లు ఇడి స్పష్టం చేసింది.




# ప్రముఖ నేత్ర వైద్యుడు నాం పెరుమాళ్ కన్నుమూత

**మధురై,జూలై24(సమయజ్యోతి):**

మధురైకి చెందిన అరవింద్ కంటి ఆసుపత్రి చైర్మన్ పి.నాంపెరుమాళ్ సామి(85)గురువారం మరణించారు. 1940 జూలై 9న తేని జిల్లాలోని వ్యవసాయ నేపథ్యం ఉన్న ఒక చిన్న కుగ్రామంలో జన్మించిన ఆయన మధురై మెడికల్ కాలేజీ నుండి ఎంబిబిఎస్ పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లారు. ఆయన దేశంలోనే మొట్టమొదటి రెటీనా నిపుణుడు. ఆయన సొంత వెంచర్‌ను ప్రారంభించే ముందు మధురైలోని ఎర్స్కిన్ హాస్పిటల్ (ప్రస్తుతం ప్రభుత్వ రాజాజీ హాస్పిటల్ అని పిలుస్తారు)లో ప్రాక్టీస్ చేశారని ఆయన పెద్ద కుమారుడు ఎన్.వెంకటేష్ ప్రజ్ఞ అన్నారు. డాక్టర్ నాంపెరుమాళ్ సామి నేత్ర వైద్య రంగంలో చేసిన అపారమైన కృషికి 2007లో పద్మశ్రీని అందుకున్నారు. ఆయన తన విశిష్టమైన మరియు సుదీర్ఘ కెరీర్‌లో అనేక అవార్డులను అందుకున్నారు. జూలై 25(శుక్రవారం) తేని జిల్లాలోని అంబసముద్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయనకు భార్య నాచియార్, ఇద్దరు కుమారులు వెంకటేష్ ప్రజ్ఞ, విష్ణు ప్రసాద్ ఉన్నారు.



# శివభక్తులపైకి దూసుకెళ్లిన కారు

## నలుగురు భకత్లు మృతి

**భోపాల్,జూలై24(సమయజ్యోతి):**

గ్వాలియర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగ్రా- ముంబై నేషనల్ హైవేపై శివపురి లింక్ రోడ్డులో కారు అతివేగంతో కన్వరియాల పైకి దూసుకెళ్లడంతో నలుగురు భక్తులు చనిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. భదావనంలోని ఒక శివాలయం నుంచి గంగాజలం సేకరించి సిమారియా గ్రామానికి తిరిగి వస్తున్న కన్వరియాల బృందాన్ని అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోయి టైరు పేలడం వల్ల ఈ ఘటన ప్రమాదానికి దారితీసింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కన్వరియాలు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు ప్రమాదం స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇలా జరగడానికి గల కారణం అతివేగమేనని పోలీసులు భావిస్తున్నారు.

# గోదావరి వద్ద పెరుగుతున్న నీటిమట్టం

**భద్రాచలం,జూలై24(సమయజ్యోతి):**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం ఉదయం గోదావరి నీటిమట్టం 21 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగడంతో దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగింది. సీతమ్మ వాగులోకి నీరు చేరడంతో నార చీరల ప్రాంతానికి పర్యాటకులను ఆపివేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు గోదావరి తీరంలో ప్రజలను అప్రమత్తం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ చేసిందే మీరు

## తప్పలను కప్పిపుచుకునేందుకు సిఎంపై నిందలా

## బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి):**

ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి నేతలు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని.. ఆ అవసరం తమ నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డికి లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బిఆర్ఎస్ తాము చేసిన పనులు ఇతరులు చేస్తారని భ్రమిస్తున్నారని మండిపడ్డారు. తమ హయాంలో చేసిన ఫోన్ ట్యాపింగ్‌పై సమాధానం చెప్పాలన్నారు. వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ సమర్థుడని చెప్పారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ మాది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వం. మా మంచి పాలనను ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్ష పాత్ర కూడా కేసీఆర్ సరిగా నిర్వహించలేక పోతున్నారు. ఇప్పటికే భారాసకు ప్రజలు బుద్ధి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే జరుగుతుంది. ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతూ విమర్శించడం సరికాదు. మీలా ట్యాపింగ్‌తో రాజకీయాలు చేయాల్సిన అవసరం మా ముఖ్యమంత్రికి లేదు. మాకు మా నాయకుల మీద నమ్మకం, విశ్వాసం ఉంది. గత ప్రభుత్వంలో భార్యాభర్తలు, సినీతారలు, జడ్జిలు మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేశారని ఆది శ్రీనివాస్ అన్నారు. ఇవన్నీ త్వరలోనే బట్టబయలు అవుతాయన్నారు. వీటికి సమాధానం చెప్పాలన్నారు.



# ప్రజాప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరు

## గతంలో ధర్నా చేసిన సందర్భంగా కేసు నమోదు

**హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి):**

మంత్రి సీతక్క నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో అప్పటి ప్రభుత్వం సీతక్కతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌పైనా కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఆమె ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు 13కి వాయిదా వేసింది. గత విచారణలో హాజరుకాలేక పోవడంతో మంత్రి సీతక్క గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రెండు షూరిటీలు ఒక్కొక్కటి రూ.10,000 చొప్పున సమర్పించారు. దీంతో కోర్టు ఎన్‌బిడబ్ల్యూను రీకాల్ చేసింది. 2021లో కరోనా మహమ్మారి తీవ్ర స్థాయిలో విస్తరించిన సమయంలో పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీలో కరోనా చికిత్సను కలపాలని డిమాండ్ చేస్తూ సీతక్క నాయకత్వంలో నిరసన కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. అయితే, ఈ నిరసనపై ప్రభుత్వం కరోనా వ్యాప్తికి కారణమయ్యారనే ఆరోపణలతో కేసు నమోదు చేసింది. కోర్టులో హాజరైన అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. కరోనా పీక్స్ -టైమ్‌లో పేదల్ని కాపాడాలని, ఆరోగ్యశ్రీలో చికిత్స కలపాలని డిమాండ్ చేశాం. కానీ, అదే కారణంగా మాపై తిరిగి కేసులు పెట్టారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో లక్షల్లో బిల్లులు వసూలు చేసినా, బడుగుల ప్రజలు ప్రాణాలతో పోరాడినా ప్రభుత్వం స్పందించలేదు. ఇక మేము మాట్లాడితే మాత్రం ఆరోపణలు, కేసులు. ఇది బాధాకరం అని అన్నారు. న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. కోర్టు తీర్పులను గౌరవిస్తాం అంటూ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కేసులో తదుపరి విచారణను కోర్టు ఆగస్ట్ 13కు వాయిదా వేసింది.

# బిఆర్ఎస్,కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

## సిఎం రేవంత్ వైఖరిలో మార్పేనిదర్శనం

## ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరంలపై నత్తనడక విచారణలు

## బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ విమర్శలు



హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి): తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ - కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాల అసలైన రూపం బయటపడిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ప్రకటన విడుదల చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర కేసులపై నత్తనడక విచారణలు రేవంత్ చిత్తశుద్ధిపై అనుమానలు కలుగుతున్నాయని అన్నారు. ఇందులో ఆమె అనేక అంశాలపై తనదైన శైలిలో వివరించారు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే 'హైడ్ అండ్ సీక్' రాజకీయ నాటకం కొనసాగుతోందని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్, వ్యక్తిగత నిఘా, గోప్యత ఉల్లంఘనలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపణలు చేశారన్నారు. తనతో పాటు తన కుటుంబం ఫోన్లు ట్యాపింగ్ కు పాల్పడ్డారని మాట్లాడారని.. కానీ, ఇప్పుడు ఆయన అవన్నీ మరిచినట్టుగా, ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే తనకు నోటీసులు వచ్చేవి కదా అనే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అలాంటప్పుడు గతంలో రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నాటకమా..? లేక ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీతో కుదిరిన ప్యాకేజీ డీలే కారణమా..? అనే అనుమానం కలుగుతోందని అన్నారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ప్యాకేజీ బేరాలు కుదిరాయన డానికి ఇది స్పష్టమైన నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీలు ప్రజల ముందు కేవలం మాటల యుద్ధం చేసుకుంటూ కుమ్ములాటలు చేసుకుంటూ, చీకట్లో ప్యాకేజీలు కుదుర్చుకుంటు-న్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంపై ఇప్పటికే కేంద్ర వ్యవస్థలు సంచలన విషయాలను బయట పెట్టాయన్నారు. ఈ విషయంలో నాడు పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసి.. అధికారంలోకి వచ్చాక అదే బీఆర్ఎస్ పార్టీకి రక్షణ కవచంగా మారారన్నారు. రూ. 38,000 కోట్లతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ. 1.2 లక్షల కోట్లకు పెంచిన సంగతి తెలిసిందేనని.. వేల కోట్లు- వృథా చేసినట్లు- కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు స్పష్టంగా పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టులో టెండర్ల మంజూరు, పునర్నిర్మాణ ఖర్చులు, నిర్మాణ వైఫల్యాలపై సంపూర్ణ విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగైనా ముందుకు వేయకుండా, ఈ కేసును నీరుగార్చే కుట్రలకే పాల్పడుతోందన్నారు. గత 19 నెలలుగా కాళేశ్వరం అవినీతి దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తూ.. అసలు దోషులను అరెస్ట్ చేయకుండా విమర్శలకే పరిమితమైందని పేర్కొన్నారు. ఇప్పటి-కై-నా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో సీబీఐ విచారణకు కోరి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మాత్రమే కాదు.. కేసీఆర్ ప్రభుత్వంలో వెలుగు చూసిన డ్రగ్స్ కేసులు, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతి, ఫార్ములా ఈ రేసింగ్ కేసులో నిధుల మళ్లింపు, ల్యాండ్ స్కాంలు, ఉద్యోగ నియామకాలలో చోటుచేసుకున్న అవక తవకలు.. ఈ కేసులన్నింటిపై విచారణ చేపడతామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అసలు దోషులను పట్టుకున్న పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ కుటుంబంతో కుమ్మక్కై అవినీతికి కవచంగా మారిందని తెలిపారు.

# యువత, విద్యార్థులకు సమగ్ర శిక్షణ

## పోటాపోటీగా జాగృతి, బిఆర్ఎస్ కార్యక్రమాలు

## 26న కొంపల్లిలో జాగృతి, నాచారంలో బిఆర్ఎస్ శిక్షణ

హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి): తెలంగాణలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని మరింత పెంచేందుకు బిఆర్ఎస్,జాగృతి సంస్థలు వేర్వేరు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు ఈ నెల 26న రెండు కీలక కార్యక్రమాలు జరగనున్నాయి. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి సంస్థ యువత, మహిళలను నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో లీడర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. అదే రోజు, భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాచారంలోని ఓ కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ రెండు కార్యక్రమాలు రాష్ట్రంలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు దోహద పడనున్నాయి. తెలంగాణ జాగృతి సంస్థ, ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో యువత, మహిళలను బలమైన నాయకులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభి స్తోంది. కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమం ద్వారా నాయకత్వ లక్షణాలను, సామాజిక సమస్యలపై అవగాహన, నిర్ణయాధికార నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. సమయజ్యోతిలో మార్పు తీసుకురావాలంటే, యువత, మహిళలు నాయకత్వ బాధ్యతలు తీసుకోవాలని కవిత పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే వారికి నాయకత్వం, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం తో పాటు, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, రాజకీయాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తినిచ్చే వేదికగా ఉంటుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. అదే రోజు నాచారంలోని కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు ప్రధాన వక్తలుగా పాల్గొననున్నారు. యువ విద్యార్థులను రాజకీయంగా చైతన్యవంతం చేయడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, రాష్ట్ర అభివృద్ధిలో వారి పాత్రను బలోపేతం చేయడమే ఈ సమావేశం లక్ష్యం. విద్య, ఉపాధి, సామాజిక న్యాయంపై చర్చలు జరపడంతో పాటు-, విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణ లకు ప్రాధాన్యత ఇస్తారు.

# ములుగు జిల్లాలో భారీ వర్షాలు

## బొగత జలపాతం వద్ద ముంచెతుతున్న వరద

## పర్యాటకులు రాకుండా అధికారుల ఆంక్షల కొనసాగింపు

ములుగు,జూలై24(సమయజ్యోతి): ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో.. బొగత జలపాతం కనువిందు చేస్తోంది. అయితే.. బొగత జలపాతం ఉన్న ములుగు అటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలపాత సందర్శన సురక్షితం కాదని అటవీ శాఖ అధికారులు ప్రజలను హెచ్చరించారు. బొగత జలపాతం దగ్గరకు రావొద్దని సూచించారు. జులై 26 వరకూ బొగత జలపాత సందర్శనపై తాత్కాలిక నిషేధం విధించారు. బొగత జలపాతం సందర్శనపై తాత్కాలిక నిషేధం విధించిన అటవీ శాఖ అధికారులు ముత్యాలధార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణపురంలో ఉన్న జలపాతాల సందర్శనపై శాశ్వత నిషేధం విధించడం గమనార్హం.బొగత జలపాతం వరంగల్ నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. వాజేడు మండల పరిధిలో ములుగు పట్టణానికి 90 కిలోమీటర్ల దూరంలో బొగత జలపాతం ఉంది. అయితే.. కాస్త వర్షాలు తగ్గాక జలపాతం అందాలను చూసేందుకు వెళ్లడం మంచిదని అన్నారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను వాతావరణ శాఖ ఇంకా హై అలర్ట్‌లోనే పెట్టింది. ఆ రెండు జిల్లాల్లో గురువారం కూడా అతిభారీ వర్షాలు కురిసాయి. ఆ రెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అయితే, పరిస్థితులను బట్టి అది రెడ్ అలర్ట్ కిందకూ మారే అవకాశాలూ లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ములుగు జిల్లా అతలాకుతలమైంది. బుధవారం ఉదయం 8.30 వరకే ములుగు జిల్లా వెంకటాపురంలో 25.5 సెంటీ-మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అదే జిల్లా ఏటూరు నాగారంలో 18.5, మంగపేటలో 15.9, ఆలుబాకలో 14.9 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి కూడా అత్యంత భారీ వర్షాలు కురిశాయి.బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి వరకు అక్కడ 21.5 సెంటీ-మీటర్ల వర్షపాతం రికార్డు అయింది. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో 23.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా మంగపేటలో 12 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రవీంద్ర నగర్‌లో 10.7, ములుగు జిల్లా ఏటూరు నాగారంలో 10.5, ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో 10.2, ములుగు జిల్లా ఆలుబాకలో 10.1, కరీంనగర్ లో 9.3, గంగిపల్లిలో 7.5, భద్రాద్రి జిల్లా మణుగూరులో 7 సెంటీ-మీటర్ల చొప్పున వర్షం పడింది.

# రెచ్చిపోయిన దొంగలు...

## అర్ధరాత్రి భారీ చోరీ

నిజామాబాద్,జూలై24(సమయజ్యోతి): నిజామాబాద్ జిల్లా లో మరోమారు దొంగలు రెచ్చిపోయారు. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామంలో దొంగలు బుధవారం అర్ధరాత్రి దుండగులు 11 ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం, విలువైన వస్తువులు అపహరించారు. పక్కన ఉన్న ఇళ్లకు బయట నుంచి గడియ పెట్టి తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. చోరీకి గురైన నగదు, బంగారు ఆభరణాల వివరాలను నమోదు చేసుకుంటు-న్నారు. ఎంత మేర సొత్తు చోరీకి గురైందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. దొంగతనానికి వచ్చిన దుండగులు ఉపయోగించిన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో పోలీసులు నిందితుల వేలిముద్రలు సేకరించారు.

# టిటిడికి దివంగత అధికారి భారి విరాళం

## హైదరాబాద్‌లో 3కోట్ల ఇల్లు..

## 66 లక్షల డిపాజిట్లు

## వీలునామా పత్రాలను అందచేసిన ట్రస్టీలు

తిరుమల,జూలై24(సమయజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిపై హైదరాబాద్‌కు చెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి తన అపారమైన భక్తిని చాటుకున్నారు. మరణానంతరం టీటీడీకి రూ.3 కోట్ల విలువైన నివాస గృహం, 66 లక్షల రూపాయల విరాళం టీటీడీకి చెందుతుందని వీలునామా రాశారు. ఈ వీలునామా రాసిన.. వై.వి.ఎస్.ఎస్. భాస్కర్ రావు చనిపోవడంతో వీలునామా ప్రకారం రూ.3 కోట్ల విలువైన నివాస గృహంతో పాటు- తన బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న రూ.66 లక్షల విరాళం టీటీడీకి అందింది.హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతంలో ఉన్న ఆనంద నిలయం అనే 3,500 చదరపు అడుగులు గల భవనాన్ని, ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ఉపయోగించాలన్న ఉద్దేశంతో ఆయన టీటీడీకి విరాళంగా ఇస్తున్నట్లు వీలునామాలో పేర్కొన్నారు. తను బ్యాంకులో దాచుకున్న సొమ్మును.. టీటీడీ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సేవలు అందిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 36 లక్షల రూపాయలు, శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్కు÷- రూ.6 లక్షలు, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవాణి ట్రస్టుకు రూ.6 లక్షలు విరాళంగా అందివ్వాలని సంకల్పించారు. తన జీవితాంతం శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో అంకితమై ఉండాలని ఆకాంక్షించిన భాస్కర్ రావు అంతిమ కోరిక మేరకు ఆయన మరణానంతరం ట్రస్టీలు ఎం.దేవరాజ్ రెడ్డి, వి.సత్యనారాయణ, బి.లోకనాథ్‌లు వీలునామా ప్రకారం ఆస్తి పత్రాలు, చెక్కులను గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీ.హెచ్. వెంకయ్య చౌదరికి అందజేశారు. భాస్కర్ రావు ట్రస్టీలను అదనపు ఈవో సత్కరించారు.



# సాగర్ కుడికాల్వ నుంచి ఎపికి నీరు విడుదల

## అనుమతులు లేకుండా

## నీటి విడుదలపై అభ్యంతరం

## కెఆర్ఎంబికి ఫిర్యాదు చేసిన తెలంగాణ

హైదరాబాద్,జూలై24(సమయజ్యోతి): శ్రీశైలం జలాశయం నిండక ముందే వచ్చిన వరదను వచ్చినట్టే నీటిని తరలించుకుపోతున్న ఏపీ దృష్టి ఇప్పుడు నాగార్జున సాగర్ పై పడిందని, కేఆర్ఎంబీ అనుమతి లేకుండా తాగు అవసరాల పేరుతో సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేసుకున్నారు. దీనిపై తెలంగాణ కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. 2023 నవంబర్ 30న ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఏపి అధికారులు పోలీస్ బలగాలతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పై దౌర్జన్యంగా ప్రవేశించి ఏపీ వైపు నుంచి 13 గేట్లు- తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వాణ పై తెలుగు రాష్ట్రాల మధ్య వివాద రగిలింది. సాగర్ ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేందుకు కేఆర్ఎంబి కృష్ణా రివర్ యాజమాన్యం బోర్డు రంగంలోకి దిగింది. నీటి వాటాల వాడకంపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సద్దుమణిగేలా నీటి ఇరు రాష్ట్రాలకు నీటి వాటాలు కేటాయింపు నిర్వహించారు. దీంతోపాటు- ప్రాజెక్టు నిర్వహణ విషయంలో సైతం ప్రాజెక్టు 26 గేట్లలో తెలంగాణ వైపున్న13 గేట్లను తెలంగాణ అధికారులు ఏపీ వైపు ఉన్న 13 గేట్ల నిర్వహణ ఆయా రాష్ట్రాల అధికారులే మైం-టైన్ చేసేలా కేఆర్ ఎంబీ ఆదేశాలను జారీ చేసింది. అప్పటినుంచి భద్రత విషయంలో కేంద్ర సీఆర్పిఎఫ్ బలగాలు నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సుమారు 18 నెలల పాటు- ఇటు- తెలంగాణ అటు- ఏపీ వైపు భద్రత బలగాలు డ్యాం పై విధులు నిర్వహించారు. సాగర్ ప్రాజెక్టు పై నెలకొన్న ప్రాజెక్టు నిర్వహణ, భద్రత, నీటి వాటాల పంపకం, మరమ్మతుల వంటి విషయంలో కేఆర్ ఎంబీ తీసుకుని నిర్ణయాలకు ఆదేశాలకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి పని చేస్తున్నాయి. కానీ తాజాగానిన్న ఏపీ అధికారులు కేఆర్ ఎంబీ నిబంధనలను ఉల్లంఘించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడికాలువకు అక్రమంగా నీటిని వదిలారు. దీంతో మరోసారి తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం రేకెత్తింది. సాగర్ కుడి కాల్వకు అక్రమ నీటి తరలింపును వెంటనే ఆపాలని కోరుతూ తెలంగాణ ఇరిగేషన్ అధికారులు కృష్ణా రివర్ బోర్డు కు ఫిర్యాదు చేశారు.

# విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

## వైద్యాధికారి డాక్టర్ సరోజ

**వరంగల్( సమయజ్యోతి ప్రతినిధి)జులై 24**

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ సరోజ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణి చేశారు. ఈ సందరర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, వైద్య సిబ్బంది పుష్ప, సురేందర్, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శి కోసం

## మండల సూపర్డెంట్ పర్వీనా ని కలిసిన ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్

**వరంగల్ (సమయజ్యోతిసమయజ్యోతి ప్రతినిధి)జులై 24**

పంచాయతీ కార్యదర్శి కోసం మండల సూపర్డెంట్ పర్వీనా ని కలిసిన ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్ చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి పంచాయతీ కార్యదర్శిని లేక ఒక సంవత్సరం నుండి గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు జిల్లా డిపిఓ దృష్టికి తీసుకెళ్లాగా గతంలో పంచాయతీ కార్యదర్శిని నియమించిన కూడా అతను వీధుల్లో చేరలేదు కావున మళ్లీ మండల అధికారులను సాంప్రదించి మా గ్రామానికి పూర్తిస్థాయి అధికారిని నియమించాలని కోరడమైనది ఇట్లు కొర్ర మోహన్ నూనె తిలక్ జరుపల ప్రవీణ్ మెరుగు లెనిన్ తదితరులు పాల్గొన్నారు



# వర్షానికి కూలిన ఇంటి గోడ

## ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నా బాధితుడు

**వరంగల్ (సమయజ్యోతి ప్రతినిది) జులై 24**

వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలం పాపయ్యపేట (బీసీ కాలనీ )గ్రామానికి చెందిన బానోతు సక్రు నిన్న కురిసిన భారీ వర్షానికి, ఇంటి గోడ కూలి, ఇంట్లోకి వర్షం నీరు చేరాయి, ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులన్నీ తడిసి ముద్దయినాయి, అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి, ఆదుకోవాలని కోరుచున్నాను, ప్రభుత్వం నుండి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు



# తనువు చాలించినా.. చూపు మాత్రం సజీవం..!

## అనారోగ్యంతో 'ఖని' లో యువకుడు మృతి మృతుడు యూ పీ హెచ్ సీలో కాంట్రాక్ట్ ఉద్యోగి నేత్రదానం చేసిన కుటుంబం అభినందించిన సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంతాపం తెలిపిన ఆరు యూ పీ హెచ్ సీల వైద్య సిబ్బంది

**వరంగల్( సమయజ్యోతి ప్రతినిధి) జులై 24**




అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు మృతి చెందాడు. కానీ.ఆయన కళ్ళు మాత్రం సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉన్నాయి. ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించడానికి మృతుని నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. పలువురికి స్ఫూర్తినిచ్చిన ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.గోదావరిఖనిలోని కాకతీయ నగర్ కు చెందిన కొత్తపల్లి రమేష్(44) అనే యువకుడు, స్థానిక ఫైవ్ ఇంక్లైన్ ఏరియాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూ పీ హెచ్ సీ)లో సపోర్టింగ్ స్టాఫ్ గా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా ఇంట్లో వాంతులు, కడుపునొప్పితో తల్లడిల్లిన రమేష్ ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన రమేష్ ను, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. రమేష్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు రోదించారు. రమేష్ నేత్రాలను దానం చేస్తే ఇద్దరికి కంటి చూపు వస్తుందని కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. మృతుని నేత్రాలను దానం చేయడానికి తండ్రి కనకయ్య, సోదరులు శంకర్, సురేష్, సోదరి జ్యోతి అంగీకారం తెలిపారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతిని కార్నియాలను సేకరించి, హైదరాబాదుకు తరలించారు. ఈ సందర్భంగా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి రమేష్ నేత్రాలను దానం చేయడానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్మెన్ కజాంపురం రాజేందర్, సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు అభినందించి, మృతుని కుటుంబానికి అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ నేత్రదానం గొప్ప పుణ్యకార్యమని, ప్రతి ఒక్కరు నేత్రదాత రమేష్ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని నేత్రదానాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రమేష్ కుటుంబం అందరికీ స్ఫూర్తించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, సీనియర్ పాత్రికేయులు మూల శంకర్, ఆర్ఎంపీ రమేష్ పాల్గొన్నారు. నివాళులర్పించిన ఆరు ఆస్పత్రుల సిబ్బంది. రామగుండం అర్బన్ పరిధిలోని ఆరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు చెందిన వైద్య సిబ్బంది రమేష్ అకాల మరణం పట్ల సంతాపం తెలిపారు. రమేష్ పార్థివ దేహాన్ని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్.సురేష్ నాయక్ సందర్శించి నివాళు లర్పించారు.నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ హర్షం.ఆప్తున్ని కోల్పోయిన దుఃఖంలో కూడా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి నేత్రదానకు అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, లగిశెట్టి చంద్రమౌళి, కార్యదర్శి భీష్మాచారి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పి.మల్లికార్జున్, అధ్యక్షులు ఎల్లప్ప, కార్యదర్శి సారయ్య, కోశాధికారి రాజేందర్ తదితరులు అభినందించారు. రమేష్ అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

# టి.ఎస్.యూ.టి.ఎఫ్. మెమోరాండం సమర్పణ - వెంటనే పీఆర్సీ అమలు చేయాలి

**సమయజ్యోతి, ఆదిలాబాద్, జులై 24, 2025:**



తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టి.ఎస్.యూ.టి.ఎఫ్.) రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్యోగులు మరియు ఉపాధ్యాయుల కోసం వెంటనే పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) అమలు చేయాలని కోరింది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు దశల ఉద్యమంలో భాగంగా బుధవారం టి.ఎస్.యూ.టి.ఎఫ్. ప్రతినిధులు భోరజ్ మండల తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వర్‌కు మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా టి.ఎస్.యూ.టి.ఎఫ్. ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అశోక్ మాట్లాడుతూ, పీఆర్సీ అమలులో ప్రభుత్వం తీవ్ర ఆలస్యం చేస్తున్నందుపై ఆందోళన వ్యక్తం చేశారు. “పీఆర్సీ గడువు ముగిసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ నివేదికను విడుదల చేయలేదు, ఫిట్మెంట్‌ను ప్రకటించలేదు. ఇది ఉద్యోగుల పట్ల తీవ్ర అన్యాయమన్నారు,” అన్నారు.వెల్ఫేర్ పథకాల పేరుతో ఉద్యోగులకు న్యాయంగా అందాల్సిన ప్రాథమిక ప్రయోజనాలను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. “అవసరమైన కనీస హక్కులు కూడా ఇవ్వకపోవడం నిందించదగ్గ విషయం,” అని అన్నారు. వెంటనే పీఆర్సీ ఫిట్మెంట్‌ను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.మెమోరాండంలో పెండింగ్ లో ఉన్న బకాయిల క్లియర్ చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డుల ప్రయోజనాలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే భవిష్యత్తులో విస్తృత స్థాయిలో నిరసనలు చేపట్టే అవకాశం ఉందని టి.ఎస్.యూ.టి.ఎఫ్. హెచ్చరించింది.మెమోరాండం సమర్పణకు టి.ఎస్.యూ.టి.ఎఫ్. జిల్లా కమిటీ సభ్యుడు ఎం. మహేందర్, భోరజ్ మండల ప్రతినిధులు ఎస్. గోపాల్, ఎ. ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన ఇల్లు

**వాజేడు ( సమయజ్యోతి ప్రతినిధి) జూలై 24**

వెంకటాపురం మండలం వి ఆర్ కె పురం గ్రామపంచాయతీ పరిధిలోని చొక్కాల గ్రామంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఐదు ఇండ్లు పూర్తిగా రెండు అడుగుల మేర నీటిలో మునిగిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో దిక్కు తోచని స్థితిలో ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేక రోడ్డుపై ఉండే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్ సంబంధిత స్థానిక వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎస్సైగా బాధ్యత తీసుకొని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ విషయం తెలియపరిచి సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ సెక్రటరీలను తీసుకువెళ్లి వెంటనే వరద బాధిత ఇళ్లను సందర్శించి స్థానికులను విషయం అడిగి తెలుసుకోగా ఎడతెరిపి లేకుండా కుంభవర్షం కురుస్తూనే ఉందని తెలియజేశారు. స్థానిక సెక్రటరీని ఉన్నతాధికారులు వివరణ అడగగా ఉదయాన్నే విషయం తెలుసుకొని జెసిపి తీసుకొని వచ్చి కాలువలు తీపించడానికి ప్రయత్నించగా కొంతమంది స్థానికులు మా ఇళ్ళ ముందు కాలువలు తీయకూడదని సహకరించలేదని అధికారులకు తెలియజేశారు. ఎస్సైస్థానికలతో మాట్లాడి స్థానికులకు సర్ది చెప్పి సమస్య నీట మునిగిన ఇళ్ల వాళ్ళది కాదు అని మన అందరిదని వివరంగా స్థానికుల తో మాట్లాడి తక్షణమే జెసిపి సహాయంతో రెండువైపులా మూడు అడుగుల మేర కాలువలు తీసి వరద నీరుని తొలగించారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి మా యొక్క సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎస్సై కి ఎంపీడీవో కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సైలు సాయి కృష్ణ, తిరుపతి రెడ్డి, రామకృష్ణ ,ఎంపీఓ సురేష్ మేజర్ గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రవీణ్, విఆర్కే పురం సెక్రటరీ రాజేందర్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# టిడిపి అధ్యక్షుడు పల్లాకు ఊరట

## విశాఖలో భవన నిర్మాణ్యాల కూల్చివేతలో చర్యలు

## ఆనాటి అధికారుల ఉల్లంఘనలపై సస్పెన్షన్లు

**విశాఖపట్టణం,జూలై24(సమయజ్యోతి):**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు ఊరట లభించింది. గాజువాక మెయిన్ రోడ్డులో కమర్షియల్ కాంప్లెక్స్ కూల్చివేతకు బాధ్యులపై వేటు పడింది. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్‌కు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ప్రత్యక్షంగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో అప్పటి డిప్యూటీ- సిటీ ప్లానర్ నరేందర్ రెడ్డి, ప్లానింగ్ సూపర్ వైజర్ వరప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వినయ్ ప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే భవన నిర్మాణాల కోసం పల్లా శ్రీనివాస్ అనుమతులు పొందారు. 2021 ఏప్రిల్ 25న అర్ధరాత్రి వేళ జీవీఎంసీ సిబ్బంది వెళ్లి భవనాన్ని కూల్చివేశారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని పల్లా శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించారు. నోటీసులు ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా వ్యవహరించారని కేసు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లా శ్రీనివాస్ కమర్షియల్ బిల్డింగ్ కూల్చివేత ఘటనపై విచారణ జరిగింది. ఏడాది తర్వాత రాజకీయ దురుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసినందుకు బాధ్యులైన అధికారులపై వేటు పడింది. అప్పటి జీవీఎంసీ కమిషనర్ సృజన కూడా బాధ్యవహించాల్సిందేనని పల్లా శ్రీనివాస రావు అన్నారు.

# 26 నుంచి సింగపూర్ పర్యటనకు చంద్రబాబు

## పెట్టుబడులే లక్ష్యంగా సిఎం పర్యటన

**అమరావతి,జూలై24(సమయజ్యోతి):**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ లో పర్యటించనున్నారు. ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు 6 రోజుల పాటు- ఆయన ఆ దేశంలో పర్యటించి దిగ్గజ సంస్థల ప్రతినిధులు, యాజమాన్యాలు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ కానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దావోస్ పర్యటనకు వెళ్లిన సిఎం...రెండో విదేశీ పర్యటనగా సింగపూర్ కు వెళుతున్నారు. బ్రాండ్ ఎపి ప్రమోషన్ తో రాష్ట్రానికి పెట్టు-బడులను సాధించేందుకు ఈ పర్యటనను వేదిక చేసుకోనున్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పారిశ్రామిక పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించి పెట్టు-బడుదారులను ఆహ్వానించనున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ-, 1053 కి.మి తీర ప్రాంతం, నిపుణులైన మానవ వనరులు గురించి వివరించనున్నారు. అలాగే పారిశ్రామిక వేత్తలను పెట్టు-బడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. 6 రోజుల పర్యటనలో సీఈఓలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ- కానున్నారు. మొదటి రోజు సింగపూర్ సహా సమీప దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రుల సంఘం నిర్వహించే 'తెలుగు డయాస్పోరా' సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఎపిలో పెట్టబడులపై ఆయా దేశాల వారిని ఆహ్వానించనున్నారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సిఎం పారిశ్రామిక వేత్తలను కోరనున్నారు. ఏపీలో పోర్టు ఆధారిత ప్రాజెక్టులు, సెమి కండక్టర్లు, ఏఐ, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన పెట్టు-బడులపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఈ ఏడాది నవంబరులో విశాఖలో నిర్వహించే పెట్టు-బడుల సదస్సుకు సింగపూర్ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించేందుకు గానూ ఆ దేశానికి చెందిన ప్రముఖులతోనూ ముఖ్యమంత్రి భేటీ- కానున్నారు. డిజిటల్ ఎకానమి, ఫిన్-టె-క్‌పై నిర్వహించే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారు. అలాగే సింగపూర్‌లో నిర్వహించే బిజినెస్ రోడ్ షోకు హాజరవుతారు. ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాలను కూడా సీఎం సందర్శించనున్నారు.

# ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన

## సృజనాత్మక శక్తిని వెలికితీసేలా ప్రత్యేక దృష్టి-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇగ్నైట్ సెల్ ఏర్పాటు

## అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్

**విజయవాడ,జూలై24(సమయజ్యోతి):**




సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనను అందించడంతో పాటు- సృజనాత్మక శక్తిని వెలికితీసేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. స్వరాంధ్ర - 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్‌ను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలో ఎ.కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెంలలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో మైనార్టీ విద్యార్థులతో పాటు బీసీ, ఎస్టీ, ఎస్సీలతో పాటు- విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించి ప్రైవేట్ పాఠశాలలకు ధీటు-గా ఫలితాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ద్వారా మూడు దశలలో 29 పాఠశాలలను ఎంపిక చేసుకుని ఐకాన్ స్కూల్స్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇందుకు ప్రభుత్వం 6 కోట్ల 72 లక్షల రూపాయలను మంజూరు చేసి రూ.4 కోట్ల 72 లక్షలు నిధులను విడుదల చేయడం జరిగిందని ఇప్పటికే 2 కోట్ల 32 లక్షల రూపాయల పనులను పూర్తిచేయడం జరిగిందన్నారు. ఆయా స్కూల్స్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు- చేసి విద్యార్థులు మెరుగైన పరిశోధనలు చేసేలా, వినూత్న ఆలోచనలను కార్యరూపమిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్ పథకం ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రై సైకిళ్లు, బ్రెయిలీ కిట్లు-, ఎల్బో క్రచ్‌లు, టీఎల్‌ఎం కిట్లు, వీల్ ఛెయిర్లు, వాకింగ్ స్టిక్‌లు వంటి ఉపకరణాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మికులు, బడిమానిన పిల్లలను గుర్తించి ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని.. జిల్లాలో 94 వేల 480 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల స్కూల్ యూనిఫామ్, బెల్ట్, బ్యాగు, బూట్లు-, నోట్ బుక్స్, -టె-క్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష అడిషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, సీఎంవో ఎన్. చంద్రశేఖర్, ఏఎంవో ఎస్. అశోక్‌బాబు, అసిస్టెంట్ ఏఎంవో శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ ఏవీవీ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలకు రక్షణ

## సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సులు

## టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ

**విజయవాడ,జూలై24(సమయజ్యోతి):**

సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను రక్షించేందుకు ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. గురువారం విజయవాడ ఆర్ అండ్ బీ బిల్డింగ్ లోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో ఏర్పాటు- చేసిన పాత్రికేయుల సమావేశంలోమన్నవ మాట్లాడుతూ రాష్ట్రంలో 24 గంటలూ ఐటీ- ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను పర్యవేక్షిస్తూ ముందస్తు హెచ్చరికలు అందిస్తూ ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) కీలక భూమి పోషిస్తుందన్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ- అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. దీనివల్ల సైబర్ నేరాలకు నేరగాళ్లు ఏ విధంగా నేరాలకు పాల్పడుతున్నారు అనే విషయాలతోపాటు- మోసపోయిన అనంతరం ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలపై అవగాహన సదస్సుల్లో తెలియ జేస్తామన్నారు. ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని సాంకేతికత ద్వారా వీటిని అరికట్ట వలసిన అవసరం ఉందన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంపై ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన విద్యార్థులు మరియు ఐటీ- నిపుణులకు శిక్షణ కోసం రాష్ట్రస్థాయి సైబర్ సెక్యూరిటీ- హ్యాకథాన్ ను నిర్వహించడం జరిగిందని, అందులో ఎంపికైన వారికి ఆరు నెలలపాటు- సైబర్ సెక్యూరిటీ లో శిక్షణ ఇచ్చామని, శిక్షణా కాలంలో నెలకు రూ. 10 వేల స్టయ్ ఫండ్ అందించామన్నారు. అనంతరం ఇంటర్న్ షిప్ పూర్తిచేసిన 30 మందికి సర్టిఫికెట్స్ ను అందించామన్నారు. సైబర్ సెక్యూరిటీ- లో నిపుణులుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దేశ, విదేశాల్లో అనేక ఐటీ- కంపెనీల్లో అవకాశాలు న్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు డేటాను దొంగిలించటం, బెట్టింగ్ యాప్ ల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించి దోచుకుంటు-న్నారని అంతేకాకుండా వ్యాపార సంస్థల వ్యాపారాలపై దాడులు చేసి వారిని ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నారన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖులతో పలు మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు సైబర్ మోసాలపై చర్యలకు ఆదేశించారన్నారు. 2013 లో సైబర్ సెక్యూరిటీపై కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని ఆ చట్టానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా 2017 లో సైబర్ సెక్యూరిటీ- పాలసీని తీసుకొచ్చిందని దానికి ఏపీటీ-ఎస్ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 లో ఏపీ సైబర్ సెక్యూరిటీ- ఆపరేషనల్ సెంటర్ (ఆఈఃూక్షఈ) ను ఏర్పాటు-చేశారన్నారు. ఈ సంస్థ ప్రభుత్వ విభాగాలకు సైబర్ సెక్యూరిటీ- ముప్పు రాకుండా నిరంతరం పర్యవేక్షించే ప్రత్యేక కేంద్రమన్నారు. ఏపీటీఎస్ తన సైబర్ సెక్యూరిటీ- ఆడిట్ సేవలను ప్రభుత్వ సెక్టార్ లోనే కాకుండా ప్రైవేట్ సెక్టార్ లోకి కూడా విస్తరించాలని అంతేకాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టు-కున్నామన్నారు. తద్వారా ఏపీకి సైబర్ సెక్యూరిటీ- ఆడిటింగ్ మీద వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ను సెక్యూర్డ్ డిజిటల్ ఫ్యూచర్ గా నిర్మించడానికి యువతను నడిపించే లక్ష్యంగా ఏపీటీఎస్ పనిచేస్తుందని చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలియజేశారు.

# క్వాంటం వాలీలో క్యూపిఐఏఐ భాగస్వామ్యం

## అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు

## చంద్రబాబుతో సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం

## అమరావతిలో ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబు సూచన

**అమరావతి,జూలై24(సమయజ్యోతి):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి క్వాంటం వాలీలో క్యూపిఐఏఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటు- చేస్తున్న క్వాంటం వ్యాలీలో క్యూపీఐఏఐ కూడా భాగస్వామ్యం వహించనుంది. దీనిలో అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఏఐ సంస్థ ముందుకు వచ్చింది. ఈ క్రమంలో అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని సిఎం అధికారులకు సూచించారు. సిఎం చంద్రబాబుతో క్యూపిఐఎఐ సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటు- చేస్తున్న క్వాంటం వ్యాలీ క్యూపిఐఏఐ సంస్థ భాగస్వామ్యం అయ్యారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని, అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు- చేయాలని అధికారులకు సిఎం ఆదేశాలిచ్చారు. అధునాతన 8 క్యూబినేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఎఐ సంస్థ ముందు కొచ్చిందని చంద్రబాబు తెలియజేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్‌తో చర్చించారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు- చేయాలని సిఎం అన్నారు. దీనితో పాటు- అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి క్యూపిఐఏఐను కోరారు. తద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు క్వాంటం అల్గారిథంలు, అప్లికేషన్‌లను రూపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్లకు సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వటం ద్వారా రైతుల ఆదాయాలను మెరుగుపడేందుకు ఈ సాంకేతికత దోహద పడాలని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి వనరులను సమర్ధంగా నిర్వహించేందుకు వీలుగా క్వాంటం టెక్నాలజీని వాడాలన్నారు. వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ తదితర అంశాల్లోనూ క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్ధంగా వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంలోనూ క్వాంటం టెక్నాలజీ సహకారాన్ని తీసుకునేలా ప్రభుత్వం యోచన చేస్తోంది. క్వాంటం లాంటి ఆధునిక సాంకేతికత ద్వారా సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగు పర్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. విద్య, పరిశోధన, ఇన్నోవేషన్ రంగాల్లో డీప్ -టె-క్ ద్వారా సమాజానికి విస్తృత ప్రయోజనాలు కల్పించటమే లక్ష్యంగా క్యూపిఐఏఐ, నేషనల్ క్వాంటం మిషన్, అమరావతి క్వాంటం వ్యాలీ పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఎపిలో పెట్టుబడుల వెల్లువ

## రూ.70వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం

## ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్,ఆటోమొబైల్స్ రంగాల్లో పెట్టుబడులు

## క్వాంటమ్ వ్యాలీ మాదిరిగా గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ

## స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం రాక

## పలు సంస్థలకు భూ కేటాయింపులకు నిర్ణయం

## నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు

## నీటి పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం

## వివరాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి

**అమరావతి,జూలై24(సమయజ్యోతి):**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర పడింది.. లిక్కర్ కేసు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకి కౌంటర్లు, సుపరిపాలన తొలి అడుగుపై చర్చించింది. మొత్తంగా 42 అజెండా అంశాలపై కేబినెట్‌లో చర్చ సాగింది.. ఎల్ఆర్ఎస్‌కు ఆమోదం తెలిపిన కేబినెట్.. ఎస్ఐపిబి ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. సీఆర్డీఏ ప్రతిపాదనలకు సంబంధించి చర్చించి ఆమోదం తెలిపింది మంత్రివర్గం.. నాలా చట్ట సవరణకు సంబంధించి చర్చించి.. ఆమోదం తెలిపారు.. ఇక, పలు సంస్థలకు భూ కేటాయింపుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.. రెండు కొత్త పాలసీలకు సంబంధించి కేబినెట్‌లో చర్చించి.. ఆ తర్వాత ఆమోదముద్ర వేశారు.. ఏపీలో మొత్తం రూ.70వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి మరీ గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు-, పట్టణాల్లో రెండు సెంట్లు- ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశంచేశారు సీఎం చంద్రబాబు. క్వాంటమ్ వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని.. దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తో సంబంధాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మన చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి సహాయం చేసిందని గుర్తు చేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందనిసీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. గతంలో అమరావతి రాజధానిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం ముందుకు వచ్చిందని.. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఆ కంపెనీ నిర్వాహకులను అప్పటి సీఎం జగన్ వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కంపెనీ నిర్వాహకులపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసిందని ధ్వజమెత్తారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులపై కేసు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేశారని.. దీంతో వాళ్లు ఏపీపై పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సింగపూర్‌తో సంబంధాలు అన్నింటిని కూడా జగన్ చెడగొట్టారని.. అందుకనే వాళ్లతో మళ్లీ మన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు

# సెప్టెంబర్‌లో ఆసియా కప్!

## దుబాయ్‌లో నిర్వహించేందుకు ప్లాన్



క్రికెట్ ఫ్యాన్స్?కు గుడ్?న్యూస్. 2025 ఆసియా కప్?పై ఓ స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టోర్నీ నిర్వహణపై కొంత కాలంగా గందరగోళం నెలకొనగా గురువారం సస్పెన్స్? వీడింది. తాజాగా జరిగిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ మీటింగ్?లో బీసీసీఐ పెద్దలు ఆన్?లైన్?లో పాల్గొన్నారు. అయితే వచ్చే ఏడాది టీ20 వరల్డ్?కప్?ను దృష్టిలో ఉంచుకొని ఈ టోర్నీని నిర్వహించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.ఈ టోర్నీకి సంబంధించిన ఆతిథ్య హక్కులు బీసీసీఐ వద్దే ఉన్నాయి. అయినప్పటికీ పలు కారణాల వల్ల తటస్థంగా దుబాయ్? వేదికగా సెప్టెంబర్?లో ఈ టోర్నీని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అధికారికంగా ప్రకటన వచ్చే ఛాన్స్ ఉన్నట్లు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు.ఇటీవల పాకిస్థాన్?తో ఉద్రిక్తతల కారణంగా ఈ టోర్నీపై సందిగ్ధం నెలకొంది. అసలు టోర్నీ ఉంటుందా? అనే రేంజ్?లో కాంట్రవర్సీ అయ్యింది. దాదాపు భారత్ ఈ టోర్నీలో పాల్గొనదని వార్తలు వచ్చాయి. పాకిస్థాన్?తో ఏ టోర్నీలోనైనా అసలు మ్యాచ్ ఆడడం అసాధ్యం అని ప్రచారం సాగింది. అయితే అవన్నీ అవాస్తవమని బీసీసీఐ మెంబక్ ఈ ప్రచారాన్ని కొట్టి పడేశారు.తాజాగా ఆసియా కప్?పై క్లారిటీ వచ్చేసింది. ఈసారి టోర్నీ టీ20 ఫార్మాట్లో జరగనుంది. అంతేకాకుండా ఈ టోర్నీ భారత్- పాకిస్థాన్ మధ్య కూడా మ్యాచ్ ఉండనున్నట్లు ఆసియా క్రికెట్ కౌన్సిల్ మెంబర్ ఒకరు చెప్పారు. దీంతో క్రికెట్ ఫ్యాన్స్?లో జోష్ వచ్చేసింది. సెప్టెంబర్ రెండో వారంలో ఈ టోర్నీ ప్రారంభం కానున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే త్వరలోనే ఈ టోర్నీ తేదీలను అధికారికంగా ప్రకటించే ఛాన్స్ ఉంది. కాగా, భారత్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోగి దిగనుంది. ఈ సారి టోర్నీ టీ20 ఫార్మాట్లో జరగనుంది. భారత్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోగి దిగనుంది. %ూజజ% షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీలో భారత్?, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, %ఖూజు%, హాంకాంగ్, ఒమన్ జట్లు పాల్గొంటాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్?లు నిర్వహించే ఛాన్స్ ఉంది.భారీ ఆదాయం తెచ్చే మ్యాచ్‌లు : భారత్- పాకిస్థాన్ మ్యాచ్‌లు ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే పోటీలు. %×జజ, ూజజ% లాంటి గవర్నింగ్ బాడీలకు ఈ మ్యాచ్‌లు చాలా కీలకం. భారత్‌కు ఆర్థికంగా పెద్దగా ప్రభావం లేకపోయినా, ఇతర బోర్డులకు మాత్రం ఇవి ప్రధాన ఆదాయ వనరులు. అందుకే గ్లోబల్ ఈవెంట్లలో భారత్- పాక్ పోటీలు నిర్వహించడానికే బోర్డులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి.

# వీడ్కోలు మ్యాచ్‌లో గర్జించిన ఆండ్రీ రస్సెల్



వెస్టిండీస్ దిగ్గజ ఆల్ రౌండర్ ఆండ్రీ రస్సెల్ తన చివరి అంతర్జాతీయ మ్యాచ్‌లో కూడా బ్యాట్ విధ్వంసం సృష్టించింది. తన కెరీర్‌లో ఎన్నో తుఫాన్ ఇన్నింగ్స్‌లు ఆడిన రస్సెల్, ఆస్ట్రేలియాతో జరిగిన ఈ మ్యాచ్‌లో కంగారూ బౌలర్లను ఉతికారేశాడు. డేంజరస్ బ్యాటింగ్‌కు పేరుగాంచిన రస్సెల్.. తన పవర్ హిట్టింగ్‌ను మరోసారి ప్రదర్శించి సిక్సర్లు బాదేశాడు. అయితే, రస్సెల్ విజయంతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకలేకపోయాడు. ఎందుకంటే ఆస్ట్రేలియా వెస్టిండీస్‌తో జరిగిన ఈ రెండవ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ను 8 వికెట్ల తేడాతో గెలుచుకుని సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి మ్యాచ్ అని ఆండ్రీ రస్సెల్ ఇప్పటికే ప్రకటించాడు. ఈ మ్యాచ్‌లో, వెస్టిండీస్ జట్టులో సగం మంది 98 పరుగుల వద్ద పెవిలియన్‌కు తిరిగి వచ్చినప్పుడు రస్సెల్ క్రీజులోకి వచ్చాడు. రస్సెల్ వచ్చిన వెంటనే, అతను తన బలాన్ని ప్రదర్శించి ఫోర్లు, సిక్సర్లు కొట్టడం ప్రారంభించాడు. అయితే, సెంచరీ వైపు వేగంగా కదులుతున్న రస్సెల్ నాథన్ ఎల్లిస్ ఉచ్చులో చిక్కుకుని అవుట్ అయ్యాడు. రస్సెల్ 15 బంతుల్లో 36 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి.వెస్టిండీస్ జమైకాలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడిన తర్వాత, ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. దీనికి ప్రతిస్పందనగా, ఆస్ట్రేలియా జట్టు దూకుడుగా బ్యాటింగ్ చేసి కేవలం 15.2 ఓవర్లలోనే విజయం సాధించింది. ఆ జట్టు గ్లెన్ మాక్స్‌వెల్ (12), కెప్టెన్ మిచెల్ మార్ష్ (21) వికెట్లను 42 పరుగులకే కోల్పోయింది. ఆ తర్వాత, జోష్ ఇంగ్లిస్ (33 బంతుల్లో 5 సిక్సర్లు, 7 ఫోర్లతో 78 పరుగులు), కామెరాన్ గ్రీన్ (32 బంతుల్లో 56 పరుగులు)తో కలిసి మూడో వికెట్‌కు 131 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆస్ట్రేలియాకు 28 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందించారు. తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన రస్సెల్‌కు మ్యాచ్ ప్రారంభానికి ముందు అతని సహచరులు మరియు , ఆస్ట్రేలియా ఆటగాళ్లు 'గార్డ్ ఆఫ్ హానర్' ఇచ్చారు. వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్‌లో ఈ వీడియోను కూడా పోస్ట్ చేసింది. దీంతో పాటు గిటార్ తీగలతో కూడిన బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చారు. అభిమానులు, జట్టు సభ్యులు, సహోద్యోగుల గౌరవం, ప్రేమకు రస్సెల్ తన కృతజ్ఞతలు తెలిపారు.





# చరిత్ర సృష్టించిన 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్

భారత యువ చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. ఆమె సెమీఫైనల్ మ్యాచ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ తాన్ ఝోంగీని 1.5-0.5 తేడాతో ఓడించింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో ఫైనల్‌కు చేరిన మొదటి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ఆమె తన మొదటి గ్రాండ్ మాస్టర్ నార్మ్‌ను కూడా సాధించింది. 19 ఏళ్ల దివ్య తెల్లపావులతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. దీంతో పాటు ఆమె 2026 మహిళల క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ప్రపంచ నంబర్ 18 అయిన దివ్య మొదటి సెమీఫైనల్‌లో నల్లపావులతో ఆడి డ్రా చేసుకుంది. రెండో గేమ్‌లో ఆమెకు తెల్లపావులతో ఆడటం ప్రయోజనకరంగా మారింది. ఆమె మిడ్ గేమ్‌లో తాన్ ఝోంగీ చేసిన తప్పులను సొమ్ముగా మార్చుకుంది. దివ్య తన నైపుణ్యాన్ని విజయంగా మార్చుకుంది. ఈ గెలుపు భారత మహిళా చెస్‌కు గొప్ప విజయం.ఇదిలా ఉండగా.. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి రెండో సెమీఫైనల్ చైనాకు చెందిన లీ టింగీతో డ్రా అయింది. ఇప్పుడు ఆమె టై-బ్రేక్ ఆడవలసి ఉంటుంది. హంపికి తెల్లపావులు ఉన్నప్పటికీ, ఆమె లీ టింగ్జీ బలమైన రక్షణను ఛేదించలేకపోయింది. ఇప్పుడు ఈ ఇద్దరు క్రీడాకారిణులు గురువారం రాపిడ్, బ్లిట్జ్ టై-బ్రేక్ గేమ్స్ ఆడతారు. దీని ద్వారా ఫైనల్‌లో రెండో స్థానం ఎవరికి లభిస్తుందో తెలుస్తుంది.ఈ టోర్నమెంట్ సెమీఫైనల్స్‌లో ఇద్దరు భారతీయ క్రీడాకారిణులు ఉన్నారు. దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్‌కు చేరుకునే క్రమంలో అనేక గొప్ప క్రీడాకారిణులు ఓడించింది. దివ్య నిర్భయంగా, దూకుడుగా చెస్ ఆడింది. తాన్ ఝోంగీ తన బలమైన ఆటతీరుకు ప్రసిద్ధి చెందింది. దివ్య ఆమెను ఓడించి మహిళా చెస్‌లో తాను ఒక కొత్త స్టార్ అని నిరూపించుకుంది.



# పంత్‌కు 6 వారాల రెస్ట్..

## పంత్ స్థానంలో ఇషాన్‌కు చోటు!

ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్ ఆడుతున్న భారత్‌ను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డి గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరంకాగా పంత్ కూడా అదే జాబితాలో చేరాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్ట్ తొలిరోజు వోక్స్ వేసిన ఫుల్ లెంగ్త్ బంతిని రివర్స్ స్వీప్ ఆడేందుకు విఫలయత్నం చేసి పంత్ గాయపడ్డాడు.బ్యాట్‌కు తగిలిన తర్వాత బంతి కుడి పాదానికి బలంగా తాకడంతో గాయమైంది. పాదం బాగా వాయడంతోపాటు రక్తస్రావం కూడా జరిగింది. దీంతో పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. నడవలేని పరిస్థితుల్లో గోల్ఫ్‌కార్ట్‌లో పెవిలియన్‌కు తరలించారు. పంత్ 6 వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ టెస్టు సిరీస్‌లో పంత్ స్థానాన్ని ఇషాన్ కిషన్‌తో భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి.బంతి పంత్? కాలుకు బలంగా తాకడంతో కాలు వాపు రావడంతోపాటు రక్త స్రావం కూడా జరిగింది. వెంటనే ఫిజియోలు మైదానంలోకి వచ్చి పంత్ గాయాన్ని పరిశీలించారు. తీవ్రత పెద్దది కావడంతో అతడిని గోల్ఫ్ కార్ట్?లో పెవిలియన్?కు తరలించారు. దీంతో పంత్ ఇన్నింగ్స్ మధ్యలోనే రిటైర్ హర్ట్?గా వెనుదిరగాల్సి వచ్చింది. పంత్ క్రీజును వీడిన సమయంలో 48 బంతుల్లో 37 పరుగులు చేశాడు.పంత్ గాయం టీమ్‌ఇండియాకు పెద్ద ఎదురు దెబ్బగా మారనుంది. అతడు బ్యాటింగ్?కు రాకపోతే భారత్ తొలి ఇన్నింగ్స్?లో 9 వికెట్లతోనే ఆడాల్సి ఉంది. ఇది జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక వ్యాఖ్యలు చేసింది. జట్టుకు అవసరమైతే పంత్ బ్యాటింగ్?కు దిగుతాడని బీసీసీఐ తాజాగా పేర్కొంది. ఇక బ్యాటింగ్ తర్వాత పంత్ డగౌట్?కే పరిమితం అవుతాడు. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ కొనసాగిస్తాడు.ఈ మ్యాచ్?లో పంత్?కు తాను రివర్స్ స్వీప్ షాట్ ప్రయత్నించినప్పుడే గాయపడ్డాడు. దీనిపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్ స్పందించాడు. అతడికి సీరియస్ ఇంజ్యూరీ కాకుంటే బాగుండు అని కోరాడు. కాలు క్రాక్ రావడం లేదా విరగడం వంటిది జరగకూడదని ఆశించాడు. అదే క్రమంలో పంత్ ఈ విధంగా ఇంకెప్పుడు రివర్స్ స్వీప్ ఆడవద్దని అన్నాడు. ఒకవేళ పంత్ దూరమైతే భారత్?కు పెద్ద దెబ్బ పడినట్లే అని పాంటింగ్ పేర్కొన్నాడు.

# కాలికి గాయమైనప్పటికీ బ్యాటింగ్‌కు వచ్చిన పంత్

ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ అద్భుతమైన సాహసం చేశారు. కాలి బొటనవేలికి ఫ్రాక్చర్ అయ్యి, వాచిపోయినప్పటికీ, నొప్పిని భరిస్తూనే రెండో రోజు బ్యాటింగ్‌కు దిగాడు. అతని ఈ తెగువకు మైదానంలో ఉన్న ప్రేక్షకులు, కామెంటేటర్లు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి తమ గౌరవాన్ని చాటుకున్నారు. పంత్ క్రీజులోకి అడుగు పెడుతుండగా అభిమానులు భారీగా చప్పట్లు కొట్టడం, కేకలు వేయడం కనిపించింది.27 ఏళ్ల పంత్ నిర్ణయాత్మక నాలుగో టెస్ట్ మొదటి రోజు క్రిస్ వోక్స్ వేసిన యార్కర్-లెంగ్త్ డెలివరీని రివర్స్ స్వీప్ చేసే ప్రయత్నంలో కాలి బొటనవేలికి బంతి తగిలింది. దీంతో తీవ్రమైన నొప్పికి గురై మైదానాన్ని వీడాడు. వెంటనే సాక్సులు, షూ తీయగా గాయం నుంచి రక్తం కారడం మొదలైంది. నొప్పి తీవ్రంగా ఉండటంతో అతన్ని గోల్ఫ్ కార్ట్‌లో మైదానం నుండి తీసుకువెళ్లారు. ప్రాథమిక స్కానింగ్‌లో కాలి బొటనవేలికి మైనర్ కాంపౌండ్ ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. దీంతో అతను కనీసం ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సలహా ఇచ్చారు.అయితే, బీసీసీఐ అప్పటికే ఒక ప్రకటనలో పంత్ ఈ టెస్ట్ మిగిలిన రోజుల్లో వికెట్ కీపింగ్ చేయడని, ఆ బాధ్యతలను ధ్రువ్ జురేల్ స్వీకరిస్తాడని తెలియజేసింది. గాయం తీవ్రంగా ఉన్నప్పటికీ, జట్టు అవసరాల దృష్ట్యా పంత్ రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చే అవకాశాన్ని బీసీసీఐ పరిశీలించింది. పంత్ నొప్పితో నడుస్తున్నప్పటికీ, జట్టు కోసం క్రీజులో నిలబడాలనే అతని పట్టుదల నిజంగా ప్రశంసనీయం. ఈ గాయం కారణంగా అతను సిరీస్‌కు దూరం అయ్యే ప్రమాదం ఉందని కూడా వార్తలు వచ్చాయి.పంత్ గాయపడినప్పటికీ బ్యాటింగ్‌కు రావడాన్ని అందరూ అభినందించారు. అయితే, శార్దూల్ ఠాకూర్ కూడా తన 88 బంతుల్లో 41 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో అంతే ప్రశంసలు అందుకున్నాడు. రెండో రోజు ఆట ప్రారంభమైన తర్వాత జోఫ్రా ఆర్చర్ తన మొదటి ఓవర్‌లోనే రవీంద్ర జడేజాను 20 పరుగుల వద్ద ఔట్ చేయడంతో ఇంగ్లాండ్‌కు ఆత్మవిశ్వాసం పెరిగింది. కానీ, ఠాకూర్, వాషింగ్టన్ సుందర్ కలిసి ఇంగ్లాండ్ బౌలర్ల దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో ఠాకూర్ 41 పరుగుల వద్ద బెన్ డకెట్ కు స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ పార్టనర్ షిప్ విడిపోయిన తర్వాతే పంత్ క్రీజులోకి వచ్చాడు. వర్షం కారణంగా ముందుగానే షెడ్యూల్ చేసిన సమయం కంటే 10 నిమిషాల ముందే రెండో రోజు భోజన విరామం ప్రకటించారు. భోజన విరామం సమయానికి భారత్ 6 వికెట్లు కోల్పోయి 321 పరుగులు చేసింది. పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

# అరంగేట్రం కోసం అభిమన్యు ఈశ్వరన్ ఎదురుచూపులు



భారత క్రికెట్‌లో ప్రతిభకు కొదవ లేదు. ప్రతి సంవత్సరం, దేశంలోని ప్రతి మూల నుంచి వర్ధమాన తారలు రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ, ఇరానీ కప్, ఇండియా ఏ వంటి వేదికలపై తమను తాము నిరూపించుకుంటున్నారు. కానీ, జాతీయ జట్టులో స్థానం సంపాదించే విషయానికి వస్తే, చాలా మంది ఆటగాళ్ల కృషి, సెలెక్టర్ల టేబుల్‌కు చేరే సమయానికి వృధా అవుతుంది. దీని కారణంగా, వారు జట్టులో తమ స్థానం కోసం చాలా కాలం వేచి ఉండాల్సి వస్తుంది.కానీ ఈలోగా, జట్టులో భాగమైన తర్వాత కూడా భారత్ తరపున ఆడలేకపోతున్న కొంతమంది ఆటగాళ్ళు ఉన్నారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ చాలా కాలంగా విస్మరిస్తున్న టీం ఇండియా క్రికెటర్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. 37 సెంచరీలు, 12000 కంటే ఎక్కువ పరుగులు చేసినప్పటికీ, అతను ఇంకా అరంగేట్రం చేయలేకపోతున్నాడు. భారత క్రికెట్ కారిడార్లలో ప్రతిభ పుష్కలంగా ఉంది. దేశీయ క్రికెట్‌లో, బౌలర్లు, బ్యాటర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. సెలెక్టర్ల దృష్టిని అలాగే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కానీ, ఈ ఆటగాళ్లలో కొంతమంది మాత్రమే టీమ్ ఇండియాలో చోటు సంపాదించడంలో విజయం సాధిస్తున్నారు.కానీ ఈలోగా, జట్టులోకి వచ్చినప్పటికీ, అరంగేట్రం చేసే అవకాశం లభించని చాలా మంది ఆటగాళ్ళు కూడా వెలుగులోకి వస్తున్నారు. స్టార్ బ్యాట్స్‌మన్ అభిమన్యు ఈశ్వరన్ విషయంలో కూడా ఇప్పుడు ఇలాంటిదే జరుగుతోంది. 29 ఏళ్ల ఈ ఆటగాడు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో బాగా రాణించడం ద్వారా తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని నిరూపించుకున్నాడు. అయినప్పటికీ, అతను ఇంకా టీం ఇండియా తరపున అరంగేట్రం చేయలేదు.2013లో తన క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన అభిమన్యు ఈశ్వరన్‌కు టీమ్ ఇండియాలో చాలాసార్లు అవకాశం లభించింది. కానీ, ప్రతిసారీ అతను ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కించుకోలేకపోయాడు. ప్రస్తుతం, అతను ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత జట్టుతో ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్నాడు. అక్కడ అతను బెంచ్‌లోనే కనిపిస్తున్నాడు. దీని కారణంగా, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అభిమన్యు ఈశ్వరన్ బెంగాల్ తరపున 103 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 177 ఇన్నింగ్స్‌ల్లో 48.70 సగటుతో 7841 పరుగులు చేశాడు. ఇందులో 27 సెంచరీలు ఉన్నాయి. 89 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో, అతను 9 సెంచరీలతో 3857 పరుగులు చేశాడు. 34 టి20 మ్యాచ్‌ల్లో 976 పరుగులు చేశాడు. ఈ విధంగా, అతను తన దేశీయ క్రికెట్ కెరీర్‌లో 12000 కంటే ఎక్కువ పరుగులు పూర్తి చేశాడు.అభిమన్యు ఈశ్వరన్ వయసు ప్రస్తుతం 29 సంవత్సరాలు, అంటే అతని టెస్ట్ కెరీర్‌కు ఇంకా 4-5 సంవత్సరాలు మిగిలి ఉన్నాయని గమనించాలి. యశస్వి జైస్వాల్, శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్ వంటి యువ బ్యాటర్లు దూకుడు శైలితో సెలెక్టర్లను ఆకట్టుకున్నారు.ఇది కాకుండా, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు కూడా జట్టులో ఉన్నారు. ఈ ఆటగాళ్ల ఉనికి అభిమన్యు ఈశ్వరన్ జట్టులో చోటు సంపాదించడం అంత సులభం కావడం లేదు. ఇటువంటి పరిస్థితిలో, అతను అరంగేట్రం చేయకుండానే రిటైర్మెంట్ ప్రకటించాల్సి రావొచ్చు.

# పవన్ వీరవిహారం హరిహరవీరమల్లు

## ఆకట్టుకున్న పవన్ నటన




పవన్‌కల్యాణ్ సినిమా అంటే అభిమానులకే కాదు, బాక్సాఫీస్‌కూ అదో పెద్ద పండగే.సుదీర్ఘ విరామం తర్వాత పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా 'హరి హర వీరమల్లు' విడుదలయ్యింది. పవన్ కెరీర్‌లో నటిస్తున్న తొలి పీరియాడిక్ మూవీ కావడం, ఏపీ డిప్యూటీ- సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా పవన్ స్వయంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆ అంచనాలు పెరిగాయి. 16వ శతాబ్దంలో మొదలయ్యే కథ ఇది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దిల్లీ పీఠంపై కూర్చొని ఎన్నెన్నో దురాగతాలకి పాల్పడుతూ పాలన కొనసాగిస్తుంటాడు. మత మార్పిడి కోసం దేశ ప్రజలని బలవంతం చేస్తుంటాడు. అందుకు ఒప్పుకోకుండా హిందువులుగానే జీవించేవాళ్ల నుంచి జిజియా పన్ను వసూలు చేస్తుంటాడు. మరోపక్క ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా, వాళ్లని పట్టించు కోకుండా దేశ సంపదని తెల్లదొరలు దోచుకెళ్తుంటారు. వాళ్లకు అనుకూలంగా కొద్దిమంది రాజులు, వాళ్ల అనుచరులు పనిచేస్తూ ఉంటారు. వాళ్లందరికీ వీర మల్లు (పవన్ కల్యాణ్) అంటే హడల్. పెద్దవాళ్ల దగ్గరున్న సంపదని దోపిడీ చేసి పేదలకి పంచిపెడుతుంటాడు. బందరు నుంచి హైదరాబాద్ నవాబ్ కుతుబ్ షాహీ దగ్గరకు తీసుకెళుతున్న వజ్రాలపై కన్నేస్తాడు వీరమల్లు. తన బలగంతో చార్మినార్ వరకూ వచ్చి మరీ వజ్రాల్ని కాజేస్తాడు. అతని వీరత్వం గురించి తెలుసుకున్న కుతుబ్ షాహీ దిల్లీలో ఔరంగజేబు సింహాసనం పై ఉన్న కోహినూర్ వజ్రాన్ని తీసుకొచ్చే బాధ్యతని అతడికి అప్పజెబుతాడు. ఏ కారణాలతో అందుకు వీరమల్లు ఒప్పుకున్నాడు?హైదరాబాద్ నుంచి దిల్లీకి వెళ్లే క్రమంలో ఆయనకి ఎదురైన పరిస్థితులు ఎలాంటివి అన్నదే సినిమా కథ. మొత్తంగా ఈ మూవీలో పవన్ వీరవిహారం చేశాడనే చెప్పాలి. ఈ కథలో పంచమి (నిధి అగర్వాల్) ఎవరు ఆమెకీ వీరమల్లుకూ సంబంధం ఏమిటి.శత్రుదుర్భేధ్యమైన ఔరంగజేబు సామ్రాజ్యంలోకి వీరమల్లు ఎలా వెళ్లాడనేది చిత్ర కథ. చారిత్రాత్మక నేపథ్యం కారణంగా ఈ కథకి అలాంటి ఇబ్బందేమీ కలగలేదు. ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్న సనాతన ధర్మం నేపథ్యాన్ని ఇందులో బలంగా స్పృశించారు. రాబిన్‌హుడ్ తరహా కథానాయకుడి పాత్రతోనూ, అభిమానుల్లో పూనకాలు తెప్పించే ఎలివేషన్స్‌తోనూ... ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యే స్వధర్మం నేపథ్యంతోనూ తెరకెక్కడం ఈ సినిమాకి కలిసొచ్చాయి. కథానాయకుడు కోహినూర్ కోసం దిల్లీకి వెళ్లే క్రమంలో ఎదురయ్యే పరిస్థితులే ఇందులో కీలకం. వీరమల్లు పాత్రకు పవన్ జీవం పోశాడనే చెప్పాలి. ప్రథమార్ధంలో యాక్షన్ సీక్వెన్స్, పాటలు సినిమాకి ప్రధాన ఆకర్షణ. ముఖ్యంగా పోర్ట్‌లో ఫైట్, అందులో ఎలివేషన్స్ అభిమానులని మరింతగా అలరిస్తాయి. ఆ తర్వాత మల్లయోధులతో, కొనసాగింపుగా చార్మినార్ దగ్గర సాగే పోరాట సన్నివేశాలతోనూ, 'కొల్లగొట్టినాదిరో' పాటతోనూ ఫస్ట్ హాఫ్ సినిమా అంచనాలకి దీటు-గానే సాగుతుంది. విరామానికి ముందు కుతుబ్ షాహీ కోటలోని సన్నివేశాలు మరింతగా అలరించడంతోపాటు-, ద్వితీయార్ధంపై మరింతగా ఆసక్తిని రేకెత్తిస్తాయి. హరి హర వీర మల్లు పాత్రలో ఒదిగిపోయారు. వీరమల్లుగా ఆయన కనిపించిన విధానం, అందులో చూపించిన హీరోయిజం, ఆయన చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకి ప్రాణం పోశాయి. సుదీర్ఘకాలంపాటు- సినిమా సాగినా లుక్ పరంగా ఏమాత్రం వ్యత్యాసం కనిపించలేదు. క్రూరమృగాల నేపథ్యంలో వచ్చే సన్నివేశాల్లోనూ, సనాతన ధర్మం ఇతివృత్తంగా సాగే సన్నివేశాల్లో ఆయన భావజాలమే కనిపిస్తుంది. నిధి అగర్వాల్ పంచమి పాత్రలో ఆకట్టుకుంటుంది. కొల్లగొట్టినాదిరో, తార తార పాటల్లో మరింత అందంగా కనిపించింది. ఆమె లుక్‌లో కూడా తేడాలేమీ కనిపించలేదు. ఔరంగజేబు పాత్రలో బాబీ దేవోల్ కనిపించిన తీరు ఆకట్టుకుంటుంది. అయితే ప్రథమార్ధంలో కనిపించినంత బలంగా ద్వితీయార్ధంలో ఆ పాత్రని చూపించలేకపోయారు. దివంగత నటుడు కోట శ్రీనివాసరావు చిన్న పాత్రలో మెరుస్తారు. మురళీశర్మ, సచిన్ ఖేద్కర్, సత్యరాజ్ తదితరులు అలవా-టైన పాత్రల్లో కనిపిస్తారు. సునీల్, నాజర్, సుబ్బరాజు, అయ్యప్ప శర్మ, కబీర్ దుహాన్ సింగ్ తదితరులు పవన్‌కల్యాణ్ జట్టుగా కనిపిస్తారు. అనసూయ, పూజిత పొన్నాడ ఓ పాటలో సందడి చేస్తారు. సాంకేతిక విభాగాల్లో కీరవాణి సంగీతం ప్రధానం. నేపథ్య సంగీతంతో సినిమాకి ప్రాణం పోశారు. సంగీతంతోనే హీరోయిజాన్ని పతాక స్థాయిలో నిలబెట్టారు. 'జనం మెచ్చే సైనికుడు అవుతాడు... జనసైనికుడు అవుతాడు', 'పాలించేవారి పాదాలే కాదు, తల కూడా కనిపించాలి' అంటూ పవన్ రాజకీయ జీవితం, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఇందులో మాటలు రాశారు సాయిమాధవ్ బుర్రా అండ్ కో. మొత్తంగా పవన్ అభిమానులు కోరుకున్న విధంగా చిత్రం ఉందనడంలో సందేహం లేదు.

# దాడిచేసిన వారిని వదలొద్దు

## రిసిప్షనిస్ట్‌పై దాడిపై

## జాన్వీ స్పందన

మహారాష్ట్రలోని కళ్యాణ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌పై దాడి ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. 25 ఏళ్ల రిసెప్షనిస్ట్ సోనాలి కలసార్‌పై గోకుల్ ఝా అనే వ్యక్తి దారుణంగా దాడి చేశాడు. అపాయింట్‌మెంట్ లేకుండా డాక్టర్ ఛాంబర్‌లోకి వెళ్లడానికి అనుమతించనందుకే ఈ దాడి జరిగినట్లు- తెలుస్తోంది. వైరల్ అయిన సీసీటీవీ ఫుటేజీలో, గోకుల్ ఝా రిసెప్షనిస్ట్‌ను కాలుతో తన్ని, ఆమె జుట్టు పట్టుకుని లాగి, నేలకేసి కొట్టడం స్పష్టంగా కనిపించింది. అక్కడే ఉన్న కొందరు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, అతను తన దాడిని కొనసాగించాడు. ఈ దాడిలో రిసెప్షనిస్ట్‌కు తీవ్ర గాయాలవడంతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అతడిపై పోలీసు కేసు నమోదు కాగా పలువురు ఈ ఘటనపై స్పందిస్తున్నారు. తాజాగా ఈ ఘటనపై నటి జాన్వీ కపూర్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో జాన్వీ రాసుకోస్తూ.. ఇలాంటి వ్యక్తులు కచ్చితంగా జైలులో ఉండాలి. అసలు ఇలాంటి ప్రవర్తనను ఎవరైనా ఎలా సమర్థిస్తారు? ఎదుటి వ్యక్తిపై చేయి చేసుకోవడానికి వారికి ఎంత ధైర్యం? మానవత్వం లేకుండా ఇలాంటి హేయమైన చర్యకు పాల్పడిన వారికి కనీసం పశ్చాత్తాపం, అపరాధ భావం కూడా ఉండవా? ఈ ప్రవర్తన చూశాక ఎవరైనా వారితో కలిసి ఉండాలని కోరుకుంటారా? ఇది అత్యంత అవమానకరమైన, అమానుషమైన చర్య. మనం ఇలాంటి ప్రవర్తనను ఎప్పటికీ క్షమించకూడదు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించి, నిందితుడిని కఠినంగా శిక్షించకపోతే అది మనందరికీ నిజంగా సిగ్గుచేటు-. ఈ వ్యక్తి జైలుకు వెళ్లాల్సిందే! అంటూ జాన్వీ పోస్టు చేసింది.



# చిన్న సినిమా సైయారా ... పెద్ద విజయం



బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై రికార్డులు సృష్టిస్తుంది సైయారా చిత్రం. ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం వారం రోజుల్లోనే ఏకంగా రూ.150 కోట్ల భారీ వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్ వద్ద సంచలనం క్రియేట్ చేస్తుంది. సాధారణంగా భారీ బడ్జెట్‌తో, పెద్ద స్టార్లతో తెరకెక్కే చిత్రాలు మాత్రమే ఈ స్థాయిలో వసూళ్లను సాధిస్తుంటాయి. అయితే, 'సైయారా' చిత్రం కంటెంట్ బలంగా ఉంటే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయాలను నమోదు చేయగలవని మరోసారి నిరూపించింది. ఆషికి 2, ఎక్ విలన్, ఆవరాపన్, వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్‌లు అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంతో ఆహాన్ పాండే, అనిత్ పడ్డా బాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం ఎటు-వంటి మౌత్‌టాక్ లేకుండా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. తొలిరోజే రూ.21 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రెండో రోజు రూ.24 కోట్లు-, మూడో రోజు రూ.35 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇక ఈ చిత్రం విడుదలైన ఆరు రోజులకే రూ.150 కోట్ల వసూళ్లను సాధించినట్లు- చిత్రబృందం ప్రకటించింది. దీంతో చాలా రోజుల తర్వాత బాలీవుడ్‌కి మంచి హిట్ వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'సైయారా' టీ-మ్ ఈ అనూహ్య విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తోంది.

# లాజిక్ లేకుండా పాత్రలు ఎంచుకోను

## పుష్ప ఫేమ్ ఫహాద్ ఫాజిల్



డిఫరెంట్ క్యారెక్టలు ఎంచుకుంటు-.. వరుస విజయాలతో తనదైన ముద్ర వేసుకున్న మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్. 'పుష్ప' మూవీతో తెలుగు ప్రేక్షకులో కూడా తిరుగులేని గుర్తింపు సంపాదించుకున్నారు. ఇక ఇప్పుడు వడివేలుతో కలిసి నటించిన కామెడీ థ్రిల్లర్ 'మారీశన్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించనున్నారు. జూలై 25న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఫహాద్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన పాత్రల ఎంపిక వెనక గల ఆలోచనల గురించి చెబుతూ.. 'ఏ పాత్ర అయినా లాజిక్ లేకుండా ఎంచుకోను. గతేడాది విడుదలైన 'వేట్టయన్' సినిమాలో నేను తొలుత ఎ÷-లాన్ చేసిన క్యారెక్టర్ కాకుండా, స్వయంగా 'ప్యాట్రిక్ అలియాస్ బ్యాటరీ' అనే పాత్రను ఎంపిక చేసుకున్న. ఆ నిర్ణయం వల్ల దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేశారు. మనకు గుర్తింపు రావాలంటే పాత్ర ఎంపికలో లాజిక్ చాలా ఇంపార్టెరట్. ఇక వ్యక్తిగతంగా చెప్పాలి అంటే నేను సోషల్ మీడియా కు పూర్తిగా దూరం. వాట్సాప్ కూడా వాడడం మానేశాను. ఇప్పటికి సంవత్సరం దాటింది.. సాదా మొబైల్ వాడుతున్నాను. సినిమాలకు సంబంధించిన కమ్యూనికేషన్ మొత్తం ఈమెయిల్ ద్వారానే జరుగుతుంది' అని అన్నారు.

# రాజీ లేకుండా అద్భుతంగా చిత్రీకరణ

## రాజమౌళి-మహేశ్ బాబు మూవీపై ప్రృథ్వీరాజ్



తెలుగు సినిమా ఇండస్ట్రీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం ఎంబిఆర్ఎం29. ఇండియన్ సినిమా స్థాయిని అంతర్జాతీయంగా తీసుకెళ్లిన క్రియేటివ్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి ఇప్పుడు మహేష్ బాబుతో మరో వండర్ క్రియేట్ చేయబోతున్నాడు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై వరల్డ్ వైడ్ బజ్ ఉంది. ఇప్పటిదాకా ప్యాన్ ఇండియా సినిమా కూడా చేయని మహేష్‌ని, ఏకంగా ఇంటర్నేషనల్ స్టార్‌ని చేసేందుకు రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటు-న్నారు. మాస్, యాక్షన్, అడ్వెంచర్, ఎమోషన్, విజువల్స్... ఇలా ప్రతి యాంగిల్‌లోనూ ది బెస్ట్ అనిపించుకునేలా తెరకెక్కించి శభాష్ అనిపించుకోవాలన్న లక్ష్యంతో జక్కన్న వర్క్ చేస్తున్నట్టు- తెలుస్తుంది.టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు, డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ పై అంచనాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్‌లో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఆయన తన తాజా చిత్రం 'సర్జమీన్' ప్రమోషన్లలో భాగంగా ఈ మూవీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ..ఇప్పటివరకు ఎవ్వరూ ఊహించని విధంగా రాజమౌళి ఈ కథను తెరకెక్కిస్తున్నారు. ఇది ఓ అద్భుత దృశ్య కావ్యం. రాజమౌళి ఎంచుకునే ప్రతీ కథా భారీగా ఉంటు-ందనే సంగతి తెలిసిందే. ఈ చిత్రం కూడా అలానే ఉంటు-ంది. ఆయన కథను చెప్పడంతో పాటు-, విజువల్స్‌తో వండర్ క్రియేట్ చేయడంలో అసాధారణ ప్రతిభ కలిగిన దర్శకుడు అని అన్నారు.?అంతేకాకుండా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులకు ఓ విజువల్ ట్రీట్‌గా నిలవనుందని పృథ్వీరాజ్ సుకుమారన్ హామీ ఇచ్చారు. ఇది మహేశ్ బాబు కెరీర్‌లోనే కాకుండా, ఇండియన్ సినిమా స్థాయిలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా కనిపిస్తోంది. రాజమౌళి గత చిత్రాలు బాహుబలి, ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్‌బస్టర్ విజయం సాధించగా, ఈ చిత్రం వాటికన్నా మరింత విస్తృతంగా తెరకెక్కుతుందని టాక్. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినీ ప్రేమికులతో పాటు-, ఇతర భాషల ఆడియెన్స్ కూడా ఈ చిత్రంపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు పృథ్వీరాజ్ వ్యాఖ్యలతో ఈ ప్రాజెక్టుపై మరింత హైప్ ఏర్పడింది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685